TITLE CODE: APTEL16281

తెలుగు దినపత్రిక

# పీపుల్స్ మోటివేషన్

People's Motivation

ఆంధ్రప్రదేశ్ / తెలంగాణ

సంపుటి : 01 | సంచిక : 99 | ఎడిటర్ : ఎం. రమేష్ | ఆదివారం, మార్చి 10, 2024 | పేజీలు : 08 | వెల రూ. 5.00/-

## హైదరాబాద్ ఐఐటీకి 60కోట్లు మంజూరు

హైదరాబాద్, మార్చి9(పీపుల్స్ మోటివేషన్) :

అత్యాధునిక మైక్రోస్కోపీ పద్ధతులను ఉపయోగించి, వినూత్న పరిశోధనలు చేయడానికి సంగారెడ్డి జిల్లా కంది పరిధిలోని ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ, హైదరాబాద్(ఐఐటీహెచ్)కు రూ.60 కోట్ల నిధులు మంజూరయ్యాయి. అధునాతన అనలిటికల్ టెక్నికల్ హెల్ప్ ఇనిస్టిట్యూట్స్ (సాతి) పథకం ద్వారా కేంద్ర డిపార్ట్‌మెంట్ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీ (డీఎస్టీ) ఈ నిధులను విడుదల చేసింది. ఇటీవల ఢిల్లీలో జరిగిన సాతీ కార్యక్రమంలో ఐఐటీ-హెచ్ పరిశోధనలను అభినందిస్తూ డైరెక్టర్ బీఎస్ మూర్తికి కేంద్ర సైన్స్ అండ్ టెక్నాలజీ సహాయమంత్రి డాక్టర్ జితేంద్ర సింగ్ షీల్డ్‌ను బహూకరించారు. అనంతరం ఐఐటీ-హెచ్ పరిశోధనల కోసం నిధులను ప్రకటించారు.

## తెలంగాణలో పలు రూట్లలో పెరిగిన స్టాంపులు

హైదరాబాద్, మార్చి9(పీపుల్స్ మోటివేషన్) :

తెలంగాణలో ప్రయాణికులకు రైల్వే శాఖ గుడ్ న్యూస్ చెప్పింది. పలు రైళ్లకు 14 స్టేషన్లలో అదనపు స్టాపులు కల్పించింది. తన విజ్ఞప్తి మేరకు ఈ స్టాపులు ఇచ్చిందని కేంద్ర పర్యాటక శాఖ మంత్రి కిషన్ రెడ్డి ట్విట్టర్ వేదికగా వెల్లడించారు. సికింద్రాబాద్, హైదరాబాద్, గుంటూరు రైల్వే డివిజన్ల పరిధిలో నడిచే పలు రైళ్లకు తెలంగాణలోని 14 స్టేషన్లలో అదనపు స్టాపేజీలు వచ్చాయని.. అందులో సికింద్రాబాద్ డివిజన్ పరిధిలోనే 9 స్టేషన్లు ఉన్నాయని తెలిపారు.

# 70 ఏళ్లలో చేయలేని పనులు పదేళ్లలో చేశా

- అభివృద్ధి కోసమే నా నిరంతర తపన
- ఈశాన్య రాష్ట్రాల్లో రూ.55వేల కోట్ల విలువైన పనులకు శ్రీకారం
- సేలా టన్నెల్‌ను ప్రారంభించిన ప్రధాని మోడీ

ఈటానగర్, మార్చి9(పీపుల్స్ మోటివేషన్):



ఎన్నికల్లో విజయం కోసం కాదు.. ప్రజల అభివృద్ధి కోసమే పనిచేస్తానని ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ అన్నారు. రెండు రోజుల ఈశాన్య రాష్ట్రాల పర్యటనలో భాగంగా శనివారం అరుణాచల్ ప్రదేశ్ కు చేరుకున్న ప్రధాని.. ఈటానగర్ లో పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో ఆయన మాట్లాడుతూ.. నార్త్ ఈస్ట్ లో మోడీ గ్యారంటీ ఫలితాలు కనిపిస్తున్నాయన్నారు. మోడీ గ్యారంటీ అంటే ఏంటో అరుణాచల్ వస్తే తెలుస్తుందన్నారు. స్వాతంత్ర్యం వచ్చినప్పటి నుంచి 2014 వరకు ఈశాన్య ప్రాంతంలో దాదాపు 10వేల కిలోమీటర్ల జాతీయ రహదారిని నిర్మించారని.. కాని, మేము10 ఏళ్లలోనే ఈశాన్య ప్రాంతంలో 6వేల కిలోమీటర్లకు పైగా జాతీయ రహదారిని నిర్మించామని చెప్పారు. కాంగ్రెస్ 70 ఏళ్ల పాలనలో చేయలేని పనులను తాను 10 ఏళ్లలో చేశామన్నారు. సరిహద్దు గ్రామాలను కాంగ్రెస్ నిర్లక్ష్యం చేసిందని మండిపడ్డారు.

6

# ఎన్‌డిఎలోకి టిడిపి, జనసేన

- మూడు పార్టీల మధ్య పొత్తులు ఖరారు
- త్వరలోనే అధికారిక ప్రకటన
- అమిత్‌షాతో సుదీర్ఘంగా చర్చించిన చంద్రబాబు
- భేటీలో పాల్గొన్న జనసేనాని పవన్ కళ్యాణ్

2





# రామేశ్వరం పేలుడు కేసు

## నిందితుడి కొత్త ఫోటోలు విడుదల

బెంగళూరు, మార్చి9(పీపుల్స్ మోటివేషన్) :

సంచలనం సృష్టించిన బెంగళూరు రామేశ్వరం కేఫ్ బ్లాస్ట్ కేసులో నిందితుడి కొత్త ఫోటోలను దర్యాప్తు సంస్థ నేషనల్ ఇన్వెస్టిగేషన్ ఏజెన్సీ ఎన్ఐఎ శనివారంనాడు విడుదల చేసింది. మార్చి 1న జరిగిన ఈ పేలుడులో సుమారు 10 మంది గాయపడ్డారు. 3వ తేదీన కేసు దర్యాప్తును ఎన్ఐఏ చేపట్టింది. కేఫ్‌లో పేలుడు జరిగిన సుమారు ఒక గంటకు నిందితుడు ఒక బస్సు ఎక్కుతుండటం సీసీటీవీ ఫుటేజ్‌లో గుర్తించారు. టైమ్‌స్టాంప్ మధ్యాహ్నం 2.03 గంటలుగా వీడియోలో ఉండగా, 12.56 గంటలకు కేఫ్‌లో పేలుడు జరిగింది. అనుమానితుడు టీ-షర్ట్, టోపీ, ఫేస్ మాస్క్ వేసుకుని కనిపించాడు. కాగా, అదే రోజుమరో ఫుటేజిలో రాత్రి 9 గంటల ప్రాంతంలో ఒక బస్సు స్టేషన్ లోపల అతను తిరుగుతున్నట్టుగా ఉంది. అనుమానితుడికి సంబంధించి సమాచారం తమకు తెలియజేస్తే రూ.10 లక్షలు రివార్డుగా ఇస్తామని కూడా ఎన్ఐఏ ప్రకటించింది. సమాచారం ఇచ్చిన వ్యక్తి పేరును గోప్యంగా ఉంచుతామని హామీ ఇచ్చింది. కేసు విచారణలో ఎన్ఐఏకు బెంగళూరు పోలీస్ సెంట్రల్ క్రైమ్ బ్రాంచ్ సహకారం అందిస్తోంది. విచారణలో భాగంగా బల్లారి జిల్లాలోని కౌల్ బజార్‌లో ఒక బట్టల వ్యాపారిని, నిషేధిత పాపుల్ ఫ్రంట్ ఆఫ్ ఇండియా (పీఎఫ్ఐ)కు చెందిన మరో వ్యక్తిని ఎన్ఐఏ టీమ్ ఇంతవరకూ అరెస్టు చేసింది. ఎన్ఐఏ సమాచారం ప్రకారం, పేలుడు ఘటనకు పాల్పడిన నిందితుడు తన పని ముగియగానే బస్సులో తుమకూరు, బళ్లారి, బీదర్, భత్కల్ సహా పలు ప్రాంతాల్లో బస్సుల్లో తిరిగాడని, విచారణకు దొరక్కుండా ఉండేందుకు ఎప్పటికప్పుడు తన ఆహార్యంలో మార్పులు చేసుకున్నాడని తెలుస్తోంది. కాగా, పేలుడు ఘటన అనంతరం మూతపడిన రామేశ్వరం కేఫ్ శనివారం తిరిగి తెరుచుకుంది. ఈసారి కేఫ్ వద్ద భారీ భద్రతా ఏర్పాట్లు చేశారు. ఎంట్రన్స్ వద్ద మెటల్ డిటెక్టర్లు ఏర్పాటు చేశారు. హ్యాండ్‌హెల్డ్ డిటెక్టర్లతో కస్టమర్లను తనిఖీ చేసి లోపలకు పంపుతున్నారు. తమ బ్రాంచీల్లోని సెక్యూరిటీ గార్డులకు శిక్షణ ఇచ్చేందుకు మాజీసైనికులతో ప్రత్యేక ప్యానల్ ఏర్పాటుకు ప్రయత్నిస్తున్నట్టు రామేశ్వరం కేఫ్ సీఈఓ, సహ వ్యవస్థాపకుడు రాఘవేంద్రరావు తెలిపారు.



తెలుగు దినపత్రిక

పీపుల్స్ మోటివేషన్

People's Motivation

## ఎంపీ అభ్యర్థి బిబి పాటిల్‌ను కలిసిన బిజెపి నాయకులు

- **నియోజకవర్గంలో పార్టీని మరింత బలోపేతం చేయాలి ఎంపీ బిబి పాటిల్**

బాన్సువాడ, మార్చి 9 (పీపుల్స్ మోటివేషన్) :







జహీరాబాద్ పార్లమెంట్ బిజెపి అభ్యర్థి బీబీ పాటిల్ ను శనివారం హైదరాబాదులోని ఆయన నివాసంలో బాన్సువాడ బిజెపి నాయకులు శ్రీనివాస్ గార్గే ఆధ్వర్యంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భం గా బాన్సువాడ నియోజకవర్గంలో పార్టీ బలోపేతంపై ఎంపీ బీబీ పాటిల్ నాయకులను అడిగి తెలుసుకున్నారు. కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెడుతున్న సంక్షేమ అభివృద్ధి కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకువెళ్లి పార్టీని మరింత బలోపేతం చేయాలని ఆయన సూచించారు. ఈ సందర్భంగా ఎంపీ బీబీ పాటిల్ ను ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ నాయకులు శ్రీనివాస్ గార్గే, బిజెపి నాయకులు అర్సపల్లి సాయి రెడ్డి, అసెంబ్లీ కో కన్వీనర్ భూపాల్ రెడ్డి,ముత్యాల సాయిబాబా, డాకయ్య, చీకట్ల రాజు, రాజా సింగ్, కొండని గంగారం, పోల్కం గోపాల్, బిజెపి నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## వినయ్ కుమార్ రెడ్డిని పరామర్శించిన బోధన్ ఎమ్మెల్యే



అర్మూర్, మార్చి 9 (పీపుల్స్ మోటివేషన్) :

అర్మూర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జీ పొద్దుటూరి వినయ్ కుమార్ రెడ్డిని బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి శనివారం ఆర్మూర్ లోని ఆయన నివాసంలో పరామర్శించారు. వినయ్ కుమార్ నానమ్మ గంగవ్వ ఇటీవల మృతి చెందారు. గంగవ్వ చిత్రపటానికి నివాళులు అర్పించారు. ఆయన వెంట రాష్ట్ర ఉర్దు అకాడమీ చైర్మన్ తాహెర్ బిన్ హందాన్, గడుగు గంగాధర్, నరాల రత్నాకర్, నిజాంసాగర్ కెనాల్ మాజీ చైర్మన్ మిర్ధపల్లి సాయి రెడ్డి, ఫతేపూర్ శ్రవణ్ రెడ్డి, జిటిపిఎల్ ఎండి ప్రకాశ్ రెడ్డి, ఆర్మూర్ మున్సిపల్ వైస్ చైర్మన్ మున్ను భాయ్, పార్టీ నాయకులు ఖాందేష్ శ్రీనివాస్, అయ్యప్ప శ్రీనివాస్, రవి గౌడ్, కాశిరాం, రహమాన్, ఫయాజ్ , కౌన్సిలర్లు ఆకుల రాము, అథిక్,ఎం, ఆర్మూర్ పట్టణ, మండల పార్టీ అధ్యక్షులు సాయి బాబా గౌడ్, చిన్న రెడ్డి, ఆలూర్ మండల అధ్యక్షుడు ముక్కెర విజయ్, బ్లాక్ కాంగ్రెస్ నాయకుడు ఇస్సాపల్లి జీవన్, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



# ఎన్‌డిఎలోకి టీడీపీ, జనసేన

- **మూడు పార్టీల మధ్య పొత్తులు ఖరారు**
- **త్వరలోనే అధికారిక ప్రకటన**
- **అమిత్‌షాతో సుదీర్ఘంగా చర్చించిన చంద్రబాబు**
- **భేటీలో పాల్గొన్న జనసేనాని పవన్ కళ్యాణ్**

న్యూఢిల్లీ, మార్చి 9 (పీపుల్స్ మోటివేషన్) :

ఎన్‌డిఎలోకి తెలుగుదేశం పార్టీ చేరిక దాదాపు ఖరారు అయ్యింది. ఈ విషయంపై త్వరలోనే ఓ ప్రకటన రానుంది. అమిత్‌షాతో టిడిపి, జసనేన నేతలు చంద్రబాబు, పవన్ కళ్యాణ్ భేటీ అయ్యాక మార్గం సుగమం అయ్యింది. నేషనల్ డెమోక్రటిడ్ అలయెన్స్ (ఎన్డీఏ) కూటమిలో చేరాలని చంద్రబాబు నాయుడు, పవన్ కల్యాణ్‌ను అమిత్ షా ఆహ్వానించారు. అందుకు ఇద్దరు నేతలు అంగీకరించా రని తెలుస్తోంది. త్వరలో జరిగే ఎన్డీఏ భేటీకి తెలుగుదేశం పార్టీ హాజరయ్యే అవకాశం ఉంది. ఈ క్రమంలో వచ్చే ఎన్నికల్లో భారతీయ జనతా పార్టీతో తెలుగుదేశం పార్టీ, జనసేన పార్టీ కలసి పోటీ చేయనున్నాయి. ఈ మూడు పార్టీల మధ్య పోటీచేసే సీట్ల లెక్క తేలింది. బీజేపీ అగ్రనేత, కేంద్ర హోం మంత్రి అమిత్ షాతో చంద్రబాబు నాయుడు , పవన్ కల్యాణ్ శనివారం నాడు చర్చలు జరిపారు. 50 నిమిషాల పాటు జరిపిన సమావేశంలో సీట్ల సర్దుబాటుపై స్పష్టత వచ్చినట్టు విశ్వసనీయ సమాచారం. రాష్ట్ర, దేశ ప్రయోజనాల కోసం కలిసి పని చేయాలని ముగ్గురు నేతలు నిర్ణయం తీసుకున్నారు. ఆంధ్రప్రదేశ్‌లో 175 అసెంబ్లీ, 25 లోక్ సభ స్థానాలు ఉన్నాయి. లోక్ సభ ఎన్నికలపై బీజేపీ దృష్టిసారించింది. ఎక్కువ సీట్లు అడగడంతో చర్చలు సుధీర్ఘంగా కొనసాగాయి. బీజేపీ, జనసేనకు 30 అసెంబ్లీ సీట్లు ఇచ్చేందుకు తెలుగుదేశం పార్టీ అంగీకరించినట్టు వార్తలు వస్తున్నాయి. 145 అసెంబ్లీ నియోజకవర్గాల్లో తెలుగుదేశం పార్టీ పోటీ చేయనుంది. 25 లోక్ సభ స్థానాల్లో 8 సీట్లను బీజేపీ, జనసేనలకు ఇచ్చేందుకు టీడీపీ ప్రాథమికంగా అంగీకరించింది. 8 సీట్లలో బీజేపీ ఆరు చోట్ల బరిలోకి దిగే అవకాశం ఉంది. అసెంబ్లీ గురించి బీజేపీ అంతగా పట్టించుకోవడం లేదు. లోక్ సభ సీట్లపై మాత్రం దృష్టిసారించింది. ఎంపీ టికెట్లు ఎక్కువ కావాలని అమిత్ షా కోరారని వార్తలు వచ్చాయి. ఆంధప్రదేశ్ అసెంబ్లీ, లోక్ సభ సీట్లకు సంబంధించి అధికార ప్రకటన రావాల్సి ఉంది. నేషనల్ డెమెక్రటిక్ అలయెన్స్ లోకి టీడీపీ చేరిక ప్రకటన ఏ క్షణమైనా రానుంది. రెండు విడతలుగా ఢిల్లీలో జరిగిన చర్చల్లో ఈ అంశంపై స్పష్టత వచ్చింది. టీడీపీ పదిహేడు పార్లమెంట్ స్థానాల్లో , బీజేపీ ఆరు స్థానాల్లో, జనసేన రెండు లోక్ సభ స్థానాల్లో పోటీ చేయనున్నారు. జనసేన రెండు స్థానాలు కాకినాడ, మచిలీపట్నంగా ఖరారయ్యాయి. రాజంపేట, ఏలూరు, అనకాపల్లి, రాజమండ్రి, అరకు, హిందూపురం నియోజకవర్గాల్లో భారతీయ జనతా పార్టీ పోటీ చేయనుంది. మిగిలిన నియోజకవర్గాల్లో తెలుగుదేశం పార్టీ తరపున అభ్యర్థులు బరిలో ఉంటారు. ఇక అసెంబ్లీ స్థానాల్లోనూ లెక్క కుదిరింది. బీజేపీ, జనసేనకు కలిసి 30 నియోజకవర్గాలు కేటాయించారు. ఇందులో ఇరవై నాలుగు జనసేన, ఆరు బీజేపీ స్థానాల్లో పోటీ చేస్తుంది. ఆ ఆరు నియోజకవర్గాలు ఏమిటేమిటి అన్నదానిపై రాష్ట్ర స్థాయిలో చర్చించి ఖరారు చేసుకుంటారు. ఉదయం పదకొండు గంటల సమయంలో చంద్రబాబు, పవన్ కళ్యాణ్ అమిత్ షాతో సమావేశం అయ్యారు. సుమారు 50 నిమిషాల పాటు ఏపీ రాజకీయాలపై చర్చించారు. ఆంధప్రదేశ్ అసెంబ్లీ ఎన్నికల్లో సీట్ల సర్దుబాటుపై ప్రధానంగా చర్చ కొనసాగింది. ఎన్నికల్లో సీట్ల సర్దుబాటుపై టీడీపీ, జనసేన, బీజేపీ మధ్య అవగాహన కుదిరిన తర్వాత అలాగే ఎన్డీఏలోకి టీడీపీని బీజేపీ ఆహ్వానించింది.. ఈ నెల 14వ తేదిన జరిగే ఎన్డీఏ సమావేశానికి చంద్రబాబును హాజరుకావాల్సిందిగా అమిత్ షా కోరారు. తమ సర్వే ప్రకారం 25 లోక్‌సభ సీట్లలో కనీసం 23 సీట్లు తెలుగుదేశం–జనసేన–బీజేపీ గెలుచుకుంటుందని బీజేపీ పెద్దలు చెప్పినట్లుగా టీడీపీ వర్గాలు చెబుతున్నాయి. ఆంధప్రదేశ్‌లో జగన్ ఆర్థిక వ్యవస్థను ఛిన్నాభిన్నం చేస్తున్న తీరు, అప్పుల పాలు చేస్తున్న వైనం తమకు ఆందోళన కలిగిస్తోందని చెప్పారు. జగన్ తమకు మద్దతుగా నిలుస్తున్నప్పటికీ ఆయనను ప్రోత్సహించడం సరైందికాదని తాము భావిస్తున్నామని పేర్కొన్నట్లు తెలిసింది. ఈ పొత్తు కుదరకుండా చేసేందుకు జగన్ చేసిన ప్రయత్నాలు కూడా ఆయన పట్ల బీజేపీలో వ్యతిరేకత పెంచిందని తెలుస్తోంది. తనకు రాష్టాభ్రివృద్ధి తప్ప మరేమీ ముఖ్యం కాదని, అమరావతిని ప్రపంచస్థాయి రాజధానిగా అభివృద్ధి చేయడం, నదుల అనుసంధానానికి వీలుగా పోలవరం వంటి బృహత్తర ప్రాజెక్టులను పూర్తి చేయడం, కేంద్రం సహకారంతో రాష్టాన్ని పారిశ్రామికంగా, సాంకేతికం గా అభివృద్ధి చేయడం తనకు ప్రధానమని చంద్రబాబు బీజేపీ నేతలకు చెప్పినట్లు తెలుస్తోంది. ప్రధాని నరేంద్రమోదీ ఆంధప్రదేశ్‌లో ఎన్నికల సందర్భంగా కనీసం మూడు, నాలుగుసార్లు పర్యటించాలనుకు న్నారని... ఈ సందర్భంగా రాష్టాభ్రివృద్ధికి అవసరమైన హామీలు ఇస్తారని కూడా బీజేపీ నేతలు హామీ ఇచ్చారు.

## హైదరాబాద్ అభివృద్ధిని అడ్డుకుంటే నగర బహిష్కరణ

- **మెట్రో విస్తరణపై కేంద్రానికి ఫిర్యాదులు తగవు**
- **బైరామల్ గూడ ఫ్లై ఓవర్ ప్రారంభంలో సిఎం రేవంత్**



హైదరాబాద్, మార్చి 9 (పీపుల్స్ మోటివేషన్) :

హైదరాబాద్‌లో మెట్రో రైలు ప్రాజెక్టు విస్తరణకు కొందరు అడ్డుపడు తున్నారని, అలాంటి వారికి నగర బహిష్కరణ తప్పదని సీఎం రేవంత్ రెడ్డి హెచ్చరించారు. ఎల్బీనగర్ నియోజకవర్గం పరిధిలోని బైరామల్‌గూడ జంక్షన్‌లో రూ.148.05 కోట్లతో నిర్మించిన లెవల్ –2 ఫ్లై ఓవర్‌ను శనివారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. నిన్న శంకుస్థాపన చేసిన పాతబస్తీ మెట్రోను ఆపాలని ఎవరో దిల్లీకి లేఖ రాశారంట. అభివృద్ధి పనులను అడ్డుకోవాలని చూస్తున్న వారికి నగర బహిష్కరణ తప్పదు. ఔటర్ రింగ్‌రోడ్డు లోపల ఉన్న అన్ని మున్సిపాలిటీలను హెచ్‌ఎండీఏ పరిధిలోకి తెస్తాం. నగర ప్రజల అవసరాలు తీర్చేలా మెట్రో రైలును విస్తరిస్తాం. భవిష్యత్‌లో నిర్మించే రీజినల్ రింగ్‌రోడ్డుతో తెలంగాణ మరింత అభివృద్ధి చెందుతుందని తెలిపారు. అనంతరం ఏర్పాటు చేసిన సభలో సీఎం మాట్లాడుతూ.. హైదరాబాద్ అభివృద్ధిని కొనసాగిస్తా మని.. ఇందులో రాజీపడబోమని సీఎం అన్నారు. రూ.50 వేల కోట్లతో మూసీనదిని ఆధునికీకరిస్తాం. శంషాబాద్ నిర్మించింది కాంగ్రెస్ పార్టీనే. రాష్ట్ర అభివృద్ధికి కట్టుబడి ఉన్నాం. 2018 లో కొడంగల్ లో ఓడిపోతే... నన్ను మల్కాజిగిరి ఎంపీగా ప్రజలు 30 వేల మెజార్టీ ఇచ్చి గెలిపించారు. మీరు ఎంపీ గా గెలిపిస్తే పీసీసీ అధ్యక్షుడిని అయ్యా. ఆ తర్వాత సీఎం అయ్యా. ఇదంతా మీ అభిమానం. మిమ్మల్ని ఎప్పటికీ మరిచిపోను. హైదరాబాద్‌కు మెట్రో తెచ్చింది కాంగ్రెస్. ఎల్బీ నగర్ నుంచి హయత్ నగర్ కు మెట్రో విస్తరిస్తాం. నాగోల్ టూ ఎల్బీ నగర్ అక్కడి నుంచి చాంద్రాయన్ గుట్ట వరకు అక్కడ నుంచి ఎయిర్ పోర్ట్‌కు మెట్రో విస్తరిస్తాం. 354 కిలో మీటర్ల మేర ఆర్‌ఆర్‌ఆర్ రీజినల్ రింగ్ రోడ్డు రాబోతుంది. మెగా మాస్టర్ ప్లాన్ 2050 తెచ్చి తెలంగాణను అభివృద్ధి చేస్తాం' అని ఆయన స్పష్టం చేశారు. మంత్రి శ్రీధర్ బాబు మాట్లాడుతూ.. హైదరాబాద్‌కు తాగునీరు తెచ్చింది కాంగ్రెస్ పార్టీనేనని చెప్పారు. శంషాబాద్ ఎయిర్ పోర్ట్, ఓఆర్‌ఆర్ తదితర పనులన్నీ కాంగ్రెస్ హయాంలోనే పూర్తయ్యాయని పేర్కొన్నారు. నియోజకవర్గ అభివృద్ధి కోసం త్వరలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని వ్యక్తిగతంగా కలుస్తానని ఎల్బీనగర్ ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి అన్నారు. రేవంత్‌ని మల్కాజ్‌గిరి ఎంపీగా ఎల్బీనగర్ ప్రజలు భారీ మెజారిటీతో గెలిపించారని.. ఈ ప్రాంత అభివృద్ధికి ముఖ్యమంత్రి సహకరించాలని ఆయన కోరారు. వంతెన ప్రారంభంతో బైరామల్‌గూడ కూడలి సిగ్నల్ ఫ్రీగా మారింది. శంషాబాద్ విమానాశ్రయం, ఒవైసీ ఆసుపత్రి వైపు నుంచి నాగార్జునసాగర్, విజయవాడ వైపు వెళ్లే వాహనాలకు ఈ పైవంతెన ఉపయోగపడుతుంది. కూడలిలో ఈ వంతెన 'వై' ఆకారంలో విడిపోతుంది. ఎడమ వైపు వెళ్తే చింతలకుంట చెక్‌పోస్టు రోడ్డుకు, కుడి వైపు వెళ్తే బీఎన్‌రెడ్డినగర్ రోడ్డుకు కలుస్తాయి. ఇదే కూడలిలో ప్రస్తుతం రెండు లూప్‌లు నిర్మాణంలో ఉండగా.. పైవంతెన శనివారం నుంచి అందుబాటులోకి వచ్చింది. ఎల్బీనగర్ వాసులు ఏళ్లుగా ఎదురుచూస్తున్న బైరామల్ గూడ మల్టీలెవల్ ఫ్లైవర్ శనివారం వినియోగంలోకి వచ్చింది. సీఎం రేవంత్ రెడ్డితో కలిసి మంత్రులు శ్రీధర్ బాబు, ఎల్బీ నగర్ ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి, జీహెచ్‌ఎంసీ మేయర్ గద్వాల విజయలక్ష్మి తదితరులుప్రారంభోత్సవ కార్యక్రమంలో పాల్గొన్నారు.

## క్వింటా రూ.17 వేలకు పైనే..

**13 ఏళ్ల తర్వాత రికార్డు ధర పలికిన పసుపు ధర**

నిజామాబాద్, మార్చి 9 (పీపుల్స్ మోటివేషన్) :

పసుపు రైతులకు మంచిరోజులొచ్చాయి. కొద్దిరోజులుగా పసుపు పంటకు గిట్టుబాటు ధర పెరుగుతుంది. నిజామాబాద్ మార్కెట్ యార్డులో గరిష్ఠంగా.. క్వింటా పసుపు ధర రూ.17,011 పలికింది. ఇప్పటి వరకూ ఉన్న ధరల్లో ఇదే ఆల్ టైమ్ రికార్డు అంటున్నారు. 2011లో క్వింటా పసుపు ధర రూ.16,166 పలుకగా.. ఇప్పటి వరకూ అదే రికార్డు ధరగా ఉంది. తాజాగా 17 వేలకు చేరడంతో ఆ రికార్డు బ్రేక్ అయింది. నిజామాబాద్ పసుపు మార్కెట్ యార్డుకు.. నిజామాబాద్, ఆర్మూర్, జగిత్యాల ప్రాంతాల నుంచి పసుపు రైతులు నిజామాబాద్ మార్కెట్ యార్డులోనే పసుపు అమ్మకాలు జరుపుతుంటారు. ఇప్పుడు రికార్డు స్థాయిలో ధర పలుకుతుండటంతో పసుపు రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. 13 ఏళ్ల తర్వాత పసుపుకు రికార్డు ధర వచ్చిందంటున్నారు. ఇన్నాళ్లు పసుపు పండించి నష్టపోయిన వారంతా ఆనందంతో ఉబ్బితబ్బిబ్బవుతున్నారు. పసుపుకు ఈ స్థాయిలో ధర రావడంపై ఎంపీ ధర్మపురి అర్వింద్ స్పందించారు. నిజామాబాద్ కు కేంద్రం పసుపుబోర్డు ఏర్పాటు చేయడంతోనే ఇది సాధ్యమైందన్నారు. పూర్తిస్థాయిలో బోర్డును ఏర్పాటు చేశాక.. మరింత రికార్డు ధర వస్తుందని, ఈ రికార్డును తామే తిరగరాస్తామని ఆశాభావం వ్యక్తం చేశారు. 2018–19లో పసుపు ఎగుమతులు లక్ష 33 వేల 600 టన్నులు ఉంటే.. ఇప్పుడు అది లక్ష 70 వేల 25 టన్నులకు పెరిగిందన్నారు. ఐదేళ్లలో పసుపు ఎగుమతులు 35 వేల టన్నుల మేర పెరిగిందని వివరించారు. పసుపు ఎగుమతి పెరిగి.. దిగుమతి తగ్గడం శుభపరిణామని తెలిపారు. ఆసియాలోనే నిజామాబాద్ పసుపుకు డిమాండ్ ఉందన్నారు.

తెలుగు దినపత్రిక
# పీపుల్స్ మోటివేషన్
People's Motivation
ఆదివారం | మార్చి | 10 | 2024



# పత్తికొండ మండలం పుచ్చకాయల మాడ గ్రామంలో కేంద్ర సాయుధ బలగాలతో కవాతు





- ప్రశాంత ఎన్నికలే లక్ష్యం
- ప్రజలు స్వేచ్ఛగా ఓటు హక్కును వినియోగించుకోవాలి
- కర్నూల్ జిల్లా ఎస్పీ జి. కృష్ణ కాంత్ ఐపియస్

**పత్తికొండ, మార్చి 09 (పీపుల్స్ మోటివేషన్):-**

ప్రశాంత వాతావరణంలో సార్వత్రిక ఎన్నికలు నిర్వహించడమే లక్ష్యంగా కేంద్ర సాయుధ బలగాలతో కలిసి పత్తికొండ యుపిస్ పోలీసులు పుచ్చకాయలమాడ గ్రామంలో కవాతు నిర్వహించారని కర్నూల్ జిల్లా ఎస్పీ జి. కృష్ణ కాంత్ ఐపీఎస్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. సార్వత్రిక ఎన్నికలు-2024 దృష్టిలో ఉంచుకొని పత్తికొండ డిఎస్పి శ్రీనివాసరెడ్డి మరియు పత్తికొండ సీఐ కె .మురళీమోహన్, ఎస్సై సి . వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో పత్తికొండ సబ్ డివిజన్ , పత్తికొండ యుపిఎస్ పోలీస్ స్టేషన్ పరిధిలోని పుచ్చకాయలమాడ గ్రామ%శీ%లో కేంద్ర సాయుధ బలగాలతో కలిసి పోలీసు అధికారులు కవాతు నిర్వహిస్తూ, గ్రామ ప్రజలలో ఆత్మవిశ్వాసాన్ని పెంపొందిస్తూ, వారిలో ధైర్యాన్ని నింపే విధంగా ఫ్లాగ్ మార్చ్ కార్యక్రమం నిర్వహించారన్నారు. ఈ ఫ్లాగ్ మార్చ్ నిర్వహించడానికి ప్రధాన కారణం గ్రామాలలో ఎటువంటి అల్లర్లు జరగకుండా, ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు జరిగే విధంగా, శాంతిభద్రతలను కాపాడడానికి 100 మంది కేంద్ర సాయుధ బలగాల పోలీసులతో కవాతు నిర్వహించారు. ప్రజల్లో ఉన్న భయాందోళనను పోగొట్టి, రాజ్యాంగం ద్వారా సంక్రమించిన ఓటు హక్కును స్వేచ్ఛగా వినియోగించుకునేలా దానికి జిల్లా పోలీసు యంత్రాంగం సహకారం ఎల్లవేళలా ఉంటుందని జిల్లా ఎస్పీ జి. కృష్ణ కాంత్ ఐపీఎస్ తెలిపారు.

## నారా లోకేష్‌ను కలిసిన రాయలసీమ ఉద్యమ యువ నాయకులు



**కర్నూలు, మార్చి 09 (పీపుల్స్ మోటివేషన్):-**

ఉమ్మడి అనంతపూర్ జిల్లాలో శంఖారావం కార్యక్రమంలో భాగంగా టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ ను శనివారం రాయలసీమ ఉద్యమ యువ నాయకులు కర్నూలు నుండి బయలుదేరి కలవడం జరిగింది. ఈ సందర్భంగా రాయలసీమ ఉద్యమ యువ నాయకులు సీమ కృష్ణ మాట్లాడుతూ రాయలసీమకు రావాల్సిన హక్కులపై మరియు నీళ్ల నిధులు నియామకాల గురించి చర్చించడం జరిగిందని తెలియజేశారు. అయితే నారా లోకేష్ రాయలసీమ వాదులతో త్వరలోనే అమరావతిలో సమావేశం నిర్వహిస్తామని తెలియజేశారని వారున్నారు. రాయలసీమకు గుండ్రేవుల ప్రాజెక్టు,వేదవతి, ఆర్డీఎస్,గురు రాఘవేంద్ర, రాజోలి సమాంతర కాలువ, పెట్నీకోట రిజర్వాయర్ గురించి మరియు వలసలు నిరుద్యోగం గురించి చర్చించడం జరిగింది అన్నారు.ఈ కార్యక్రమంలో రాయలసీమ ఉద్యమ యువ నాయకులు భూషణ్,రవింద్ర నాయక్,రాము,సుధాకర్, గణేష్,దస్తగిరి ప్రవీణ్ నాయక్ గోపాల్ ,షేక్షా తదితరులు పాల్గొన్నారు.

## ఈనెల 11 వతేదీన రుద్రవరం దినసరి సంత మార్కెట్ వేలం పాట

**నంద్యాల/రుద్రవరం, మార్చి 09 (పీపుల్స్ మోటివేషన్):-**



ఈనెల 11వ తేదీ సోమవారం మధ్యాహ్నం 3 గంటలకు రుద్రవరం మేజర్ పంచాయతీకి సంబంధించిన దినసరి, సంత మార్కెట్ వేలం పాటలు నిర్వహిస్తున్నట్లు ఈవో సుబ్బారావు తెలిపారు. శనివారం ఆయన మాట్లాడుతూ సంత మార్కెట్, దిన మార్కెట్ వేలం పాట లలో పాల్గొనేవారు రూ 50 వేల డిపాజిట్ చెల్లించి వేలంపాటలలో పాల్గొనవచ్చు అన్నారు. అలాగే కబేలా మార్కెట్ కు సంబంధించి రూ 10,000 డిపాజిట్ చెల్లించాలన్నారు. ఈ వేలం పాటలు ఈవో పి ఆర్ డి శ్రీనివాస శర్మ, సర్పంచ్ ఆధ్వర్యంలో నిర్వహించడం జరుగుతుందన్నారు. డిపాజిట్ చెల్లించని వారిని వేలంపాటలకు అనుమతించబోమని ఇందుకు సంబంధించి గ్రామస్తులకు దండోర ద్వారా తెలియజేయడం జరిగిందని ఈవో తెలిపారు.

## మరో వారంలో లోక్‌సభ ఎన్నికల షెడ్యూల్..?

### లోక్‌సభ ఎన్నికలకు అంతా సిద్ధమవుతోన్న ఈసి

**న్యూఢిల్లీ, మార్చి 9 (పీపుల్స్ మోటివేషన్) :**

లోక్‌సభ ఎన్నికలకు అంతా సిద్ధమవుతోంది. మరో వారంలో ఎన్నికల తేదీలను కేంద్ర ఎన్నికల సంఘం ప్రకటించే అవకాశం కనిపిస్తోంది. సోమవారం నుంచి బుధవారం వరకు జమ్మూ కాశ్మీర్‌లో ఎన్నికల నిర్వహణ కార్యక్రమాలను పరిశీలించేందుకు కేంద్ర ఎన్నికల సంఘం అధికారలు ఆ రాష్ట్రంలో పర్యటిస్తున్నారు. దీని తర్వాత గురువారం లేదా శుక్రవారం లోక్‌సభ ఎన్నికల షెడ్యూల్ విడుదలయ్యే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. సెప్టెంబర్ నెలలోగా జమ్మూ కాశ్మీర్‌లో అసెంబ్లీ ఎన్నికలు నిర్వహించాలని సుప్రీంకోర్టు ఆదేశించిన నేపథ్యంలో ఈసీ అధికారులు పర్యటిస్తున్నారు. లోక్‌సభ ఎన్నికలతో పాటు అసెంబ్లీ ఎన్నికల్ని కూడా ఒకేసారి నిర్వహించవచ్చో..? లేదో.. అనే విషయాన్ని అంచనా వేయాలని కేంద్రం ఈసీని కోరింది. బుధవారం పర్యటన ముగియగానే తర్వాతి రెండు రోజుల్లో ఎప్పుడైనా షెడ్యూల్ వెలువడొచ్చని తెలుస్తోంది.

## అధికారులు బిలాల్ నగర్లో నీటిని తాగి చూడండి



- మురుగును తలపిస్తున్న నీరు కంపు వాసన కొడుతున్నాయి

**నంద్యాల, మార్చి 09 (పీపుల్స్ మోటివేషన్):-**

నంద్యాల పట్టణంలో శివారు ప్రాంతం కాదండీ నడిబొడ్డున వున్న బిలాల్ నగర్లో అధికారులు ఒకసారి నీటిని తాగి చూస్తే తెలుస్తుంది. వారం రోజులుగా వస్తున్న నీరు మురుగు నీరును తలపిస్తుంది.వస్తున్న నీరు కంపు,వాసన వస్తున్నాయని ఆ ప్రాంత ప్రజలు ఆరోపిస్తున్నారు.అధికారులకు ఫోన్ చేసి ఎన్ని సార్లు చెప్పినా పట్టించుకునే పరిస్థితి లేదు.వార్డ్ కు సంబందించిన పిట్టర్ కు ఫోన్ చేస్తే ఇప్పుడు వస్తా,అప్పుడు వస్తా అనే సమాధానం తప్పా సమస్యకు పరిష్కారం లేదంటున్నారు.ప్రధానంగా మంచి నీటి పైపులు కొన్ని కాల్వల్లో వుండడంతో చిలుము పట్టు పైపు లకు రంధ్రాలు పడడం వల్లా నీరు కలుషితం అవుతున్నాయని ప్రజలు పేర్కొంటున్నారు.ఎన్నికలు వస్తె మాత్రమే నాయకులు,కౌన్సిలర్స్ వస్తారు కానీ ఎన్నికలు అయిపోతే వార్డ్ వైపు కన్నెత్తి చూసిన పాపాన పోలేదని ప్రజలు శాపనార్థాలు పెడుతున్నారు.పట్టణంలో అన్ని వార్డుల్లో మంచినీటి,కాల్వల సమస్య అధికంగా వుందని ప్రజలు వాపోతున్నారు.వేసవి కాలాన్ని దృష్టిలో పెట్టుకొని మంచినీటి ఇబ్బందులు లేకుండా చూడాలని ప్రజలు కోరుతున్నారు.అన్ని వార్డుల్లో కౌన్సిలర్స్ వార్డుల్లో తిరిగి మంచి నీటి సమస్య తలెత్తకుండా చుకోవల్సిన బాధ్యత ఎంతైనా వుంది.



## జగన్ అంటే భయం అందుకే పొత్తులతో పోటీకి వస్తున్నారు

- మాజీ మంత్రి శిల్పా మోహన్ రెడ్డి

**నంద్యాల, మార్చి 09 (పీపుల్స్ మోటివేషన్):-**





జగన్ అంటే భయమని అందుకే జనసేన, బిజెపి పార్టీలతో కలిసి ఎన్నికలలో పోటీకి దిగారని మాజీ మంత్రి శిల్పా మోహన్ రెడ్డి పేర్కొన్నారు. శనివారం నంద్యాల పట్టణంలోని దేవ నగర్, వీసీ కాలనీ, శ్యామ్ నగర్ ల నుండి వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు దేవనగర్ బాషా, కౌన్సిలర్స్ చంద్ర శేఖర్, మాజీ కౌన్సిలర్ లు జాకీర్ హుస్సేన్, దిలీప్ కుమార్ అధ్వర్యంలో పార్టీ కోసం అహర్నిశలు పాటుపడే ఉత్సాహవంతులైన, చాకుల్లాంటి కుర్రాళ్లను టీడీపీ నుండి వైసీపీ లోకి తీసుకు రావడం అభినందనీయం అన్నారు. వీరందరికీ మాజీ మంత్రి శిల్పా మోహన్ రెడ్డి మరియు ఎమ్మెల్సీ ఇషాక్ భాషా పార్టీ కండువాలను కప్పి సాదరంగా ఆహ్వానం పలికారు. వైఎస్ఆర్సిపి పార్టీ బలోపేతానికి రానున్న ఎన్నికల్లో సీఎం గా జగన్మోహన్ రెడ్డిని నంద్యాలలో శిల్పా రవిరెడ్డి, ఎంపీ పోచ బ్రహ్మానంద రెడ్డి విజయానికి కృషి చేయాలని కోరారు. ఈ సందర్భంగా మాజీ మంత్రి శిల్పా మోహన్ రెడ్డి మాట్లాడుతూ.. పార్టీ విజయానికి యువత ఎంతో ప్రాముఖ్యమని యువత తలచుకుంటే సాధించలేనిది ఏదీ లేదని అన్నారు రాష్ట్రంలో యువ నాయకుడైన జగన్మోహన్ రెడ్డి పాలనలో రాష్ట్రం ఎంతో పురోగతిని సాధించిందని, మునుపెన్నడూ లేనంతగా అభివృద్ధి సంక్షేమం చేపడుతూ రాష్ట్ర ప్రజల మన్ననలను జగన్మోహన్ రెడ్డి పొందుకున్నారన్నారు. అటువంటి యువనాయకత్వంలో నంద్యాలలో ఎమ్మెల్యే శిల్పారవిరెడ్డి అనేక అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలను చేపడుతూ ప్రజలకు చేరువయ్యారన్నారు. గడపగడపకు మన ప్రభుత్వం అనే కార్యక్రమంలో ఎమ్మెల్యే శిల్పారవి రెడ్డి ప్రతి గడపకు వెళ్లి వారి సమస్యలను గుర్తించి పరిష్కరించారని, అలాగే వారందరి ఆధార అభిమానులను చూరగొన్నారన్నారు. వైఎస్ఆర్సిపి ప్రభుత్వం అధికారం చేపట్టిన తర్వాత రెండు సంవత్సరాలు కరోనా కష్ట కాలం పోగా మిగతా మూడు సంవత్సరాల్లో అనేక అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలను చేపట్టారన్నారు. నంద్యాలలో 500 కోట్లతో మెడికల్ కళాశాల, 158 కోట్లతో అమృత్ పథకాన్ని అలాగే జిల్లా ప్రభుత్వ ఆసుపత్రి భవనాల ఆధునికరణ, అర్హులైన పేద ప్రజలందరికీ ఇళ్ల స్థలాలు, గృహాలను అందించారని తెలిపారు . పట్టణాభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించి రోడ్లు, సీసీ డ్రైన్లు ,కల్వర్టులు, విద్యుత్ స్తంభాలు , నీటి సరఫరా ఇలా అనేక మౌలిక సదుపాయాలను కల్పించారన్నారు. గతంలో ఎందరో ఎమ్మెల్యేలు, మంత్రులు అధికారం చేపట్టినా , వైఎస్ఆర్సిపి ప్రభుత్వం ప్రారంభించిన గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టడం జరిగిందన్నారు. రానున్న ఎన్నికల్లో రెట్టించిన ఉత్సాహంతో యువత పనిచేయాలని, వైయస్సార్ పార్టీ బలోపేతానికి ఎమ్మెల్యే శిల్పారవి రెడ్డి , ఎంపీ పోచా బ్రహ్మానందరెడ్డి విజయానికి అహర్నిశలు కృషి చేయాలని కోరారు. మరోసారి రాష్ట్రంలో వైఎస్ఆర్సిపి ప్రభుత్వం జగన్మోహన్ రెడ్డి సీఎంగా అధికారం చేపడితే మరోసారి అవకాశం ప్రజలు అందిస్తే అనేక అద్భుతాలు చేసి చూపిస్తారన్నారు. టిడిపి అధికారంలో ఉన్న సందర్భంలో చంద్రబాబు నాయుడు ప్రజలకు అనేక హామీలను ఇచ్చారని వాటిలో ఏ ఒక్కటి అమలుకు నోచుకోలేదన్నారు. ఎన్నికల వేల చంద్రబాబు నాయుడు మరోసారి ప్రజలను మోసం చేసే హామీలతో ప్రజల వద్దకు వస్తున్నారని, ప్రజలు అటువంటి వాటిని నమ్మవద్దని తెలిపారు. జగన్మోహన్ రెడ్డి యువత భవిష్యత్తును ఆలోచించే నాయకుడిగా రానున్న కాలంలో విప్లవాత్మకమైన మార్పులను తీసుకురావడానికి సిద్ధంగా ఉన్నారన్నారు. వైఎస్ఆర్సిపి పార్టీ విజయానికి ప్రతి ఒక్క నాయకుడు కలిసికట్టుగా పనిచేయాలని కోరారు. నంద్యాల ప్రజలందరి ఆశీస్సులు ఎమ్మెల్యే అభ్యర్థి అయిన శిల్పా రవిరెడ్డి, ఎంపీ పోచ బ్రహ్మానందరెడ్డి పై ఉండాలని కోరారు. ఈ కార్యక్రమంలో నజీర్, వాసిం , సలీం, హరి,మున్న, వంశీ, ఫారుక్, శివ మరియు వారి కుటుంబ సభ్యులు, మిత్రులు, శ్రేయోభిలాషులు వైఎస్ఆర్సిపి అభిమానులు పాల్గొన్నారు.

తెలుగు దినపత్రిక

పీపుల్స్ మోటివేషన్

People's Motivation

# రంపచోడవరం నియోజకవర్గం అభివృద్ధి చెందాలంటే

- మూడు పార్టీల పొత్తు లో బిజెపికే ఎమ్మెల్యే సీటు కేటాయించాలి
- అల్లూరి సీతారామరాజు జిల్లా ప్రధాన కార్యదర్శి చోళ్ళ బజ్జి రెడ్డీ

**రంపచోడవరం, మార్చి 09 (పీపుల్స్ మోటివేషన్):-**

రంపచోడవరం నియోజకవర్గంలో 3వ ప్రత్యామ్నాయంగా బిజెపి ని ప్రజలు కోరుకుంటున్నారు. జరగబోయే సార్వత్రిక ఎన్నికలలో రంపచోడవరం నియోజకవర్గం ప్రజలు నియోజకవర్గంలో బిజెపి గెలిపించుకోవాలని అనుకుంటున్నారు. నియోజకవర్గంలో జరిగే అభివృద్ధి పనులన్ని కేంద్రప్రభుత్వం నిధులతోనే జరుగుతున్నాయి. అలాగే కేంద్ర ప్రభుత్వం సంకల్ప ప్రాజెక్ట్ ద్వారా వెనుకబడిన మండలాలలో పూర్తి స్థాయి మౌలిక వసతుల కల్పన లో భాగంగా మారేడుమిల్లి, వై. రామవరం, గంగవరం మండలాలను కేంద్రం ఎంపిక చేసింది. పి ఎం జన్ మన్ ద్వారా పివిటిజి లకు గృహాలు, కరెంట్ సౌకర్యం ఏర్పాటుచేస్తుంది.నియోజకవర్గంలో 5 ఏకలవ్య మోడల్ పాఠశాలలు,ప్రధాన మంత్రి గ్రామ సడక్ యోజన ద్వారా రోడ్లు, వంటి అభివృద్ధి పనులు అన్ని కేంద్రప్రభుత్వం ద్వారానే జరుగుతున్నాయన్న విషయం ప్రజలు గమనిస్తున్నారని ఈ సారి నియోజకవర్గంలో బిజెపి ని గెలిపించుకొని కేంద్రం ద్వారా మరిన్ని అభివృద్ధి పనులు చేయించుకోవాలని ప్రజలుకోరుకుంటున్నారు. బిజెపి, టిడిపి, జనసేన పొత్తులో భాగంగా రంపచోడవరం నియోజకవర్గం బిజెపి కి కేటాయించాలని కోరుకుంటున్నారు. నియోజకవర్గంలో కాంగ్రెస్, టిడిపి వైఎస్సార్ కాంగ్రెస్ కాంగ్రెస్ పాలన చూశామని ఈ సారి బిజెపి ని గెలిపించాలని కోరుకుంటున్నారు. నియోజకవర్గంలో టిడిపి బలంగా ఉన్నా 2009,2014,2019 ఎన్నికలలో వరుసగా మూడుసార్లు ఓడిపోయింది. దీనికి కారణంపార్టీలోఅంతర్గత విబేదాలు ఉన్నట్లుభావించవలసి ఉన్నది.నియోజకవర్గంలో బిజెపి పార్టీ సంస్థగతంగా నిర్మాణం చేసుకుంటూ,క్షేత్ర స్థాయిలో పనిచేసుకోని వెళుతుంది.మండల కమిటీలు, బూత్ కమిటీలతో పాటు అనుబంధ సంఘాలతో పనిచేసుకుంటూ ఎన్నికలకు సర్వం సిద్ధం చేసుకుంది. పొత్తులలో నియోజకవర్గం సీటు బిజెపి కి కేటాయిస్తే ప్రజలు గెలిపించుకోవడం సిద్ధంగా ఉన్నారని బిజెపి జిల్లా



ప్రధానకార్యదర్శి సోళ్ళ బొజ్జిరెడ్డి అన్నారు.

## ఇంటి స్థలం, డబుల్ బెడ్ రూమ్ ఇల్లు ఇచ్చి ఆదుకోవాలి



**భద్రాచలం, మార్చి 09 (పీపుల్స్ మోటివేషన్):-**

స్థానిక ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో మాల మహానాడు జిల్లా అధ్యక్షుడు అల్లాడి పౌల్ రాజ్ ఆధ్వర్యంలో భద్రాచలం శాసనసభ్యులు తెల్లం వెంకటరావు కి ఏఎంసి కాలనీలో నివసిస్తున్న ఎస్సీ బీసీ మైనార్టీ నిరుపేద కుటుంబాలకు ప్రభుత్వం ద్వారా ఇంటి స్థలం లేదా డబల్ బెడ్ రూమ్ ఇల్లు ఇప్పించగలరని వినతి పత్రాన్ని అందించడం జరిగింది. గత 20 సంవత్సరాలుగా ఏఎంసీ కాలనీలో ఎస్సీ బీసీ మైనార్టీ నిరుపేద కుటుంబాలు అద్దె ఇళ్లలో జీవిస్తున్నారని, రెక్కాడితే గాని డొక్కాడని దుర్భర జీవితం కడుపుతున్న పేద ప్రజలకు గత ప్రభుత్వం డబల్ బెడ్ రూమ్ ఇల్లు ఇచ్చి ఆదుకుంటదని ఆశపడ్డ నిరుపేదలకు నిరాశ మిగిల్చిందని, ప్రస్తుత ప్రభుత్వం పేదలకు ఇల్లు లేదా ఇంటి స్థలం తమరి ద్వారా వస్తుందని నమ్మకంతో విన్నవించడం జరుగుతుందని అన్నారు. పేదల స్థితిగతులు ఆర్థిక పరిస్థితులు దృష్టిలో పెట్టుకొని ఏఎంసి కాలనీలో 20 ఇండ్లుగా అద్దె ఇళ్లల్లో నివసిస్తున్న ఎస్సీ ,బీసీ మైనార్టీ కులాల పేదలకు అండగా ఉండి ఆదుకుంటారని ఆశిస్తున్నామని అన్నారు. ఈ కార్యక్రమంలో దాసరి నాగమణి, బర్ల భవాని, మొరంపల్లి అనూష, వాల్లారపు జయమ్మ, సందా మేరీ, మొరంపల్లి పుల్లమ్మ, దరిసిన చర్ల పద్మ, రాచమల్ల కుమారి, మోతుకూరి రమాదేవి, గద్దల శేషమ్మ, కుసుమ,అరుణ, పూసం సుజాత, వెన్నె రేవతి, ఎస్.కె మోదిన బి, కొంగ లావణ్య తదితరులు పాల్గొన్నారు.

## కొత్తగూడెంలో "మాదిగల ఆత్మీయ సమ్మేళనం"ను జయప్రదం చేయండి

- మాదిగ జే.ఏ.సి. రాష్ట్రప్రధానకార్యదర్శి మోదుగు.జోగారావు



**కొత్తగూడెం, మార్చి 09 (పీపుల్స్ మోటివేషన్):-**

హైదరాబాద్ లోని మినిర్వా హెూటల్ లో మాదిగ జే.ఏ.సి.వ్యవస్థాపకులు, యస్.సి.కార్పొరేషన్ మాజీ చైర్మన్ డా.పిడమర్తి.రవి మరియు సంఘ ముఖ్యనాయకుతో జరిగిన సమావేశంలో డా.పిడమర్తి.రవి మాట్లాడుతూ మాదిగలకు 12 % రిజర్వేషన్ సాధనే లక్ష్యంగా రాష్ట్ర వ్యాప్తంగా అన్ని నియోజకవర్గాలలో ఈ నెల 10వ తేదీ నుంచి జరుగుతున్న "మాదిగల ఆత్మీయ సమ్మేళనాలు" జయప్రదం చేయాలని కోరినారు.భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కేంద్రంలోని, బస్ స్టాండ్ దగ్గరలో గల "పక్రుతి ఆశ్రమం"లో ఈనెల 16న శనివారం సాయంత్రం 4గం.లకు, డా.పిడమర్తి.రవి ముఖ్య అదితిగా విచ్చేయుచున్న "మాదిగ ఆత్మీయ సమ్మేళనాన్ని" మాదిగ జే.ఏ.సి.రాష్ట్ర నాయకులు,జిల్లా,నియోజకవర్గ,మండల నాయుకులు, ఉద్యోగ సంఘాల నాయకులు, అభిమానులు, శ్రేయోభిలాషులు అధిక సంఖ్యలో పాలుగొని మాదిగల ఆత్మీయ సమ్మేళనాన్ని జయప్రదం చేయాలని మాదిగ జే.ఏ.సి. రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మోదుగు.జోగారావు కోరినారు.ఈ సమావేశంలో మాదిగ జే.ఏ.సి.రాష్ట్ర యూత్ అధ్యక్షులు నక్కా.మహేష్,మాదిగ జే.ఏ.సి.భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అధ్యక్షులు,మాజీ సర్పంచ్ గద్దల.రమేష్,బి.యస్.పి. రాష్ట్ర అధ్యక్షులు బోరెల్లి.సురేష్,నగేష్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రతి మహిళా గ్రూప్ వాట్సాప్ గ్రూప్ క్రియేట్ చేసుకోండి

**నెక్కొండ, మార్చి 09 (పీపుల్స్ మోటివేషన్):-**

వరంగల్ జిల్లా నెక్కొండ మండలంలోని 39 గ్రామపంచాయతీలలోని మహిళా గ్రూపులు వారి గ్రూపు పేరున ఒక వాట్సాప్ గ్రూప్ క్రియేట్ చేసుకోవాలని ఏపీఎం శ్రీనివాస్, సీసీ రవి లు తెలిపారు. వారు మాట్లాడుతూ ప్రతి గ్రూపు పారదర్శకంగా ఉండాలంటే వాట్సాప్ గ్రూప్ క్రియేట్ చేసుకుని ఆయా గ్రూపులు వారి బ్యాంకు లింకేజీ, ఇతర రుణాలు పొదుపులు, ప్రతినెల బ్యాంకులో చెల్లించి, చెల్లించిన రసీదులను గ్రూపులో ఫోటో తీసి పెడితే గ్రూపు సభ్యులకు గ్రూపు లీడర్ల పని తీరుపై వారికి విశ్వాసం ఉంటుందని, గ్రూపు లీడర్లు పారదర్శకంగా వ్యవహరించినట్టు అవుతుందని, వారన్నారు. ఎవరైతే ప్రతినేలా చెల్లించిన రసీదులు సభ్యులకు చూపని ఎడల వారిపై గ్రూపు సభ్యులకు అనుమానాలు కలుగుతాయని, చాలా గ్రామాల నుండి ఇలాంటి ఆరోపణలు వస్తున్నందున గ్రూపు లీడర్ల పనితీరు సభ్యులకు తెలిసే విధంగా ఉండుటకై ఈ విధానాన్ని మేము మండలంలోని అన్ని గ్రూపులకు ప్రవేశపెడుతున్నామని అందరూ విధిగా పాటించాలని అప్పుడే గ్రూపు లీడర్లపై సభ్యులకు నమ్మకం ఏర్పడుతుందని, అప్పుడే గ్రూపులు ఎంతో ఆర్థికంగా అభివృద్ధి చెందుతాయని వారన్నారు.

## రాష్ట్ర చరిత్రలో అత్యధిక విద్యుత్ సరఫరా

- గత సంవత్సరం కంటే ఈ సంవత్సరం ఎక్కువ విద్యుత్ సరఫరా
- గత పాలకులు వాస్తవాలు పక్కనపెట్టి భ్రమలు కల్పించారు
- డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క వెల్లడి

**హైదరాబాద్, మార్చి 9 (పీపుల్స్ మోటివేషన్) :**

రాష్ట్ర చరిత్రలో ఇప్పటి వరకు ఇవ్వనటువంటి విద్యుత్ నీ రాష్ట్ర ప్రజలకు అందించామని, రాష్ట్రంలో నిన్న విద్యుత్ 15623 మెగావాట్ల వినియోగం అయ్యిందన్నారు డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క. ఆయన మీడియాతో మాట్లాడుతూ.. గతంలో 15497 మెగావాట్ల విద్యుత్ (30.03.2023న) నమోదైనట్లు ఆయన పేర్కొన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చినప్పటి నుంచి విద్యుత్ సరఫరా చేశామని, గత సంవత్సరం కంటే ఈ సంవత్సరం ఎక్కువ విద్యుత్ సరఫరా చేశామని ఆయన వెల్లడించారు. గత పాలకులు వాస్తవాలు పక్కన పెట్టి భ్రమలు కల్పించారని, 2022 డిసెంబర్ లో 200 మిలియన్ యూనిట్లు వాడితే 2023 డిసెంబర్ 207.07 మిలియన్ యూనిట్లు సరఫరా చేసామని భట్టి విక్రమార్క వ్యాఖ్యానించారు. గత ప్రభుత్వం సరఫరా కంటే ఈ ప్రభుత్వం డిసెంబర్ నుంచి ఎక్కువ విద్యుత్ సరఫరా చేసామని, ఇంకా ఎక్కువ డిమాండ్ వచ్చినా తట్టుకుని సరఫరా చేస్తామన్నారు భట్టి విక్రమార్క. మార్చి, ఏప్రిల్ లో ఎక్కువ వాడకం ఉండబోతోందని%‰% 16వేల మెగావాట్ల ఉత్పత్తి, విద్యుత్ సరఫరాకు ఏర్పాట్లు చేస్తున్నామని ఆయన తెలిపారు. ఎవరైనా అపోహలు కల్పిస్తే నమ్మొద్దని ఆయన వెల్లడించారు. గత పాలకులు కల్పించిన ఇబ్బందుల నుంచి కూడా బయటపడేందుకు చర్యలు తీసుకుంటున్నామని, కోల్ మినిస్టర్ ను కలిసి తడిచెర్ల బొగ్గు బ్లాక్ గురించి చర్చించామన్నారు. ఆదర్శవంతమైన రాష్ట్రంగా తెలంగాణను తీర్చిదిద్దుతామని, త్వరలో విద్యుత్ పాలసీని ప్రవేశ పెడతామన్నారు. ఫ్లోటింగ్ సోలార్ కోసం సర్వే చేసాం. త్వరలో రిపోర్టు రాబోతుందని, సోలార్ విద్యుత్ ను ఎలా వాడుకోవచ్చనే అంశాలపై ప్రణాళికలు రూపొందిస్తున్నామన్నారు. సర్ ప్లస్ విద్యుత్ ఉండే రాష్ట్రంగా తెలంగాణను మారుస్తామని భట్టి విక్రమార్క తెలిపారు. రాష్ట్రంలో విద్యుత్ కు ఇబ్బంది లేకుండా ఓ ప్రణాళికా బద్ధంగా ముందుకు వెళ్తున్నామని, గృహాలక్ష్మీ పై కొందరు తప్పుడు ప్రచారం చేస్తున్నారన్నారు. అంతేకాకుండా..'200 యూనిట్ల వరకు ఉచితంగా విద్యుత్ అందిస్తున్నాం. ఉచిత కరెంటు కావాల్సిన వారు ప్రజా పాలన దరఖాస్తు చేసుకోవాలని కోరాము. మీరు ఇచ్చిన రేషన్ కార్డు వివరాలు, సర్వీసు కనెక్షన్ వివరాల ఆధారంగా జీరో బిల్లులు ఇస్తున్నాము. మీరు ఇచ్చిన దరఖాస్తులో ఏదైనా తప్పులు ఉంటే సమీపంలోని ఎంపిడివో ఆఫీసులో సరి చేసుకోవచ్చు. 200 యూనిట్ల లోపు విద్యుత్ వాడే వారిని బిల్ ఎవరు అడగరు. ఇబ్బందులు ఉండవు. ఇప్పటి వరకు 40 లక్షల 33 వేల702 మందికి గృహాజ్యోతి జీరో బిల్లును అందజేశాము. మహిళలకు ఇందిరా క్రాంతిపథంను వడ్డీ లేని రుణాలు ఇచ్చే కార్యక్రమం ఈనెల 12న హైదరాబాద్ నుంచి ప్రారంభిస్తున్నాం. గత ప్రభుత్వం డిస్కమ్స్ ను ఆగం చేసింది. కాళేశ్వరం, కొన్ని విద్యుత్ ప్రాజెక్టులను నిరర్ధక ఆస్తులుగా వదిలి వేయలేము. వ్యవసాయం చేసే రైతులకే రైతుబంధు. భవిష్యత్ లో 5 ఎకరాల వరకు మాత్రమే రైతుబందు ఇస్తాం. 3 నుంచి 4 ఎకరాలు వున్న వారికి ప్రస్తుతం రైతుబంధు ఇస్తున్నాము. కొద్ది రోజుల్లోనే 5 ఎకరాల రైతులకు రైతుబందు వేస్తాం. ఎన్ని ఇబ్బందులు ఉన్నా కాంగ్రెస్ చెప్పిన గ్యారెంటీలను అమలు చేస్తూనే ఉన్నాం. నెల మొదటి రోజే ప్రభుత్వ ఉద్యోగులకు జీతాలు చెల్లించాము. మేము నిబద్ధత, ఆర్థిక క్రమశిక్షణతో ముందుకు వెళ్తున్నాం. పది లక్షల లోపు పెండింగ్ బిల్లులను కాంగ్రెస్ ప్రభుత్వం ముందు క్లియర్ చేశాం. 15,071 కోట్లు రైతు భరోసాకు కేటాయింపు చేశాం. 40 వేల కోట్ల బిల్లులు పెండింగ్ లో పెట్టింది గత ప్రభుత్వం. బీఆర్ఎస్ ప్రభుత్వం మాదిరిగా బిల్లులు పెండింగ్ లో పెట్టడం లేదు.' అని భట్టి విక్రమార్క వ్యాఖ్యానించారు.

## పాక్ అధ్యక్షుడిగా మరోసారి జర్దారీ ఎన్నిక

**కరాచి, మార్చి 9 (పీపుల్స్ మోటివేషన్) :**

పాక్ అధ్యక్షుడిగా మరోసారి అసీఫ్ అలీ జర్దారీ ఎన్నికయ్యారు. మొదటి నుంచి అధ్యక్ష పదవి రేసులో ఆయన పేరే ఎక్కువగా వినిపించింది. ఇప్పుడు అధికారికంగా ఆ పేరునే ప్రకటించారు. పాకిస్థాన్ 14వ అధ్యక్షుడిగా ఆయన బాధ్యతలు చేపట్టనున్నారు. అధ్యక్ష ఎన్నికల్లో జర్దారీకి 255 ఓట్లు రాగా.. అతని ప్రత్యర్థికి 119 ఓట్లే వచ్చాయి. దీంతో పాకిస్థాన్ అధ్యక్షుడిగా రెండోసారి ఆసిఫ్ అలీ జర్దారీ ఎన్నికయ్యారు.

## ప్రకృతిలో స్త్రీ పురుషుడు సమానులే

- ఆడ మగ వివక్షతను ఎండగట్టాలి
- ఆడవారు అబలలు కాదు సభలలు అని నిరూపించాలి
- మహిళలు అన్ని రంగాలలో రాణించాలి .
- 16వ వార్డు కౌన్సిలర్ సలిగంటి వీరేంద్ర సరిత

**సూర్యాపేట, మార్చి 9 (పీపుల్స్ మోటివేషన్) :**

ఆడపిల్లలను కన్న తల్లిదండ్రులు తప్పకుండా చదివించాలని విద్య ద్వారానే జీవితంలో ఉన్నత శిఖరాలు ధిరోహించవచ్చని, మహిళల కోసం ఓటు హక్కు, ఆస్తి హక్కు, సమాన పనికి సమానం వేతనపు హక్కు, ఎనిమిది గంటల పని దినాల హక్కు, ఉచిత నిర్బంధ విద్యాహక్కు, బాల కార్మికుల నిర్మూలన హక్కు, ప్రసూతి సెలవుల హక్కులను కల్పించిన భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ చెప్పిన ఆశయాలను కొనసాగించాలని, ఈ ప్రకృతిలో స్త్రీ పురుషులు సమానులే అని, ఆడ మగ అనే వివక్షతను ఎండగట్టాలని, ఆడవారు అబలలు కాదు సబలలు అని నిరూపించాలని 16వ వార్డు కౌన్సిలర్ సలిగంటి వీరేంద్ర సరిత అన్నారు. శనివారం సూర్యాపేట జిల్లా కేంద్రంలో శ్రీరామ్ నగర్ కాలనీ దుర్గామాత కమిటీ ఆధ్వర్యంలో సీనియర్ ఉపాధ్యాయురాలు నిర్మల అధ్యక్షతన నిర్వహించిన అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలలో జ్యోతి ప్రజ్వలన చేసి ఆమె ముఖ్యఅతిథిగా విచ్చేసి ప్రసంగించారు. మహిళలు ఇంటి పనికి, వంట పనికి పరిమితం కాకుండా శాస్త్ర సాంకేతిక విద్య వైద్య వ్యాపార వాణిజ్య సామాజిక సాహిత్య ఆర్థిక రంగాలలో అగ్రభాగాన ఉండాలని నిలవాలని ఆకాంక్షించారు. కష్టపడి కాకుండా ఇష్టపడి విద్య ను నేర్చుకొని తాము అనుకున్న లక్ష్యాలను సాధించి జీవితంలో ఉన్నత శిఖరాలు అధిరోహించాలని సూచించారు. ఎంతోమంది స్త్రీలు గృహంలో కానీ, ఉద్యోగం చేసే చోట మహిళలు హింసకు, అవమానాలకు, గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అయినా అవమానాలు, అవహేళనలను ధైర్యంతో ఎదుర్కోవాలని పిలుపునిచ్చారు. మహిళలు ఉద్యోగాలు చేసి ఆర్థికంగా స్థిరపడినప్పుడే గ్రామం, రాష్ట్రం, దేశం అభివృద్ధి పథంలో నడుస్తుందన్నారు. స్త్రీ లేనిదే ఈ సృష్టి లేదని, మానవజాతి మనుగడనే లేదని వివరించారు. దుర్గామాత కమిటీ అధ్యక్షులు సీనియర్ ఉపాధ్యాయులు ప్రభాకర్ మాట్లాడుతూ భారతీయ సాంప్రదాయంలో మాతృమూర్తులకు ఎంతో గౌరవం ఉండేదని సంస్కృతి సాంప్రదాయం భారతీయులకు గుండెకాయ లాంటిదని ఆ సంస్కృతిని సాంప్రదాయాలను పరిరక్షించుకోవాలని కోరారు. సలిగాంటి వీరేంద్ర సీనియర్ ఉపాధ్యాయులు నాగవెల్లి దశరథ పాడిన పాట సీనియర్ జర్నలిస్ట్ గోల్డ్ మెడలిస్ట్ డాక్టర్ బంటు కృష్ణ ఆలపించిన కవిత పలువురిని ఆకట్టుకున్నాయి. ఇంకా ఈ కార్యక్రమంలో కీసర అనురాధ, గుండపనేని శిరీష దుర్గామాత కమిటీ సభ్యులు మహిళలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. అనంతరం మహిళలను శాలువాలు మెమెంటోల తో ఘనంగా సన్మానించారు తదుపరి మిఠాయిలు పంచారు.

## బీఆర్ఎస్‌కు మరో షాక్..

**హైదరాబాద్, మార్చి 9 (పీపుల్స్ మోటివేషన్) :**

బీఆర్ఎస్ పార్టీకి మరో భారీ షాక్ తగిలింది. మాజీ ఎంపీ సీతారాం నాయక్ బీఆర్ఎస్‌ను వీడుతున్న అని ప్రకటించిన మరునాడు ఉమ్మడి వరంగల్ డీసీసీబీ చైర్మన్ మార్నేని రవీందర్ రావు, ఆయన సతీమణి ఐనవోలు ఎంపీపీ మధుమతిలు బీఆర్ఎస్ వీడి మరికొద్దిసేపటి క్రితం కాంగ్రెస్ పార్టీ కండువా కప్పుకున్నారు. ప్రభుత్వ సలహాదారు, మాజీ ఎమ్మెల్యే వేం నరేందర్ రెడ్డి సంక్షేమ లో రవీందర్ రావు, మధుమతి దంపతులు.. కాంగ్రెస్ పార్టీలో చేరారు. మాజీ సీఎం కేసీఆర్ కుటుంబానికి సన్నిహితుడు మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు ప్రధాన అనుచరుడిగా ఉన్న మార్నేని ఎన్నికల అనంతరం నాటి నుంచి పార్టీ మారుతాడన్న ప్రచారం విస్తృతంగా జరుగుతోంది. ఈ నేపథ్యంలోనే ఆయన బీఆర్ఎస్ పార్టీకి అంటి ముట్టనట్లుగానే ఉంటూ వస్తున్నారు. పలుమార్లు పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, ఎమ్మెల్యే హరీష్‌రావులు మార్నేనితో చర్చలు జరిపినా ఆయన కాంగ్రెస్ లో చేరడం చర్చనీయాంశం గా మారింది.

తెలుగు దినపత్రిక
# పీపుల్స్ మోటివేషన్
People's Motivation
ఆదివారం । మార్చి । 10 । 2024


# సంక్షేమ పథకాలతో ఓటుబ్యాంకు

- **నగదు బదిలీతో మరోమారు అధికారం**
- **అభివృద్ధి కార్యక్రమాలకు చెల్లుచీటి**

**అమరావతి, మార్చి 9 (పీపుల్స్ మోటివేషన్) :**

అమరావతి ఉద్యమాన్ని జగన్ ఉక్కుపాదంతో అణివేస్తున్నారు. ఆందోళన లను పట్టించుకోక పోవడం..లేదా వారికి వ్యతిరేకంగా ఇతర గ్రూపులను రెచ్చగొట్టడం..చంద్రబాబు తన కులం వారి కోసం అమరావతిని తయారు చేసారని ప్రచారం చేయడంలో సిఎం జగన్ విజయం సాధించారు. ఈ క్రమంలో విశాఖను రాజధానిగా చేసుకునే క్రమంలో అక్కడ భూ కార్యకలాపాలు ఎప్పుడో ఊపందుకున్నాయి. త్వరలోనే విశాఖకు రాజధాని అంటూ మరోమారు ప్రకటించారు. ఇక అక్కడే ప్రమాణం చేస్తానని , గెలిచివచ్చేది తానేనని జగన్ ప్రకటించారు. అమరావతి కేసు సుప్రీంలో ఉండగానే ఆయన తన విశాఖ రాజధాని కలను సాకారం చేసుకునే దిశగా వేగంగా పావులు కదిపినా సాకారం కాలేదు. అమరావతి భూముల విషయంలో రైతుల ఆందోళనలను పట్టించుకోక పోవడం కూడా అలవాటుగా చేసుకున్నారు. తన తండ్రి వైఎస్ రాజశేఖర్ రెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు ఇబ్బడి ముబ్బడిగా కంపెనీలు ఏర్పాటు చేసి, ప్రభుత్వం నుంచి మేళ్లు పొందిన వారి నుంచి వాటిలో 'పెట్టుబడులు' పెట్టించారని జగన్‌పై ఆరోపణలు ఉన్నాయి. కేసులు పడ్డాయి. జైలుకు కూడా వెళ్లారు.ఇక తాజాగా ఎపిలో అవినీతి నుంచి ప్రజల దృష్టి మళ్లించడానికి కొన్ని సంక్షేమ కార్యక్రమాలు అమలు చేస్తున్న తీరు ఖాళీ ఖజానాకు నిదర్శనంగా మారింది. సంక్షేమం పేరిట అడ్డమైన పథకాలు అమలు చేస్తూ బలమైన ఓటు బ్యాంకు ఏర్పాటుకు ఆయన ఎత్తుగడ వేశారు. విచ్చలవిడిగా డబ్బుల పంపిణీ కార్యక్రమాలను సంక్షేమం పేరుతో అమలు చేయడం వల్ల రాష్ట్రం దివాళా దిశగా చేరింది. ఖజానా ఖాళీ అయ్యింది. అప్పులపాలు అవుతు న్నప్పటికీ ఎవరు కూడా ఎదరించడం లేదు. ఎదరించినా పట్టించుకోవడం లేదు. తమకు సహాయం చేయడానికి ప్రభుత్వం వద్ద డబ్బు లేకపోయినా, జగన్ అప్పులు చేసి మరీ ఇస్తున్నాడని ఆయనపై సానుభూతి వెల్లువెత్తేలా ప్రచారం చేస్తున్నారు. రాష్ట్ర ప్రభుత్వం చేస్తున్న అప్పులను జగన్ తీర్చబోరు. ప్రజలు కూడా తమకు ఏమి వస్తుందా అన్నదే చూస్తున్నారు తప్ప రాష్ట్రానికి కలిగే నష్టాన్ని గమనించడం లేదు. రేపటి గురించి ఎవరు కూడా పెద్దగా ఆలోచించడం లేదు. అభివృద్ధిని పూర్తిగా విస్మరించి సంక్షేమ మోడల్‌ను ఎంచుకోవడంలోనే జగన్ వ్యూహం దాగి ఉంది. సంక్షేమం మాటున పన్నుల భారం వేస్తున్న ప్పటికీ, ప్రజలకు తమపై భారం పడిందన్న విషయమే తెలియడం లేదు. అధికార పార్టీ నాయకులందరూ సంక్షేమ పథకాల గురించే మాట్లాడుతున్నారు గానీ అభివృద్ధి ఊసే ఎత్తడం లేదు. ఈ ఐదేళ్లలో తెలంగాణ కంటే ఆంధ్రప్రదేశ్‌కే ఎక్కువ పెట్టుబడులు వచ్చాయని ఆ రాష్ట్ర పరిశ్రమల మంత్రి గుడివాడ అమర్‌నాథ్ రెడ్డి చేసిన ప్రకటన చూస్తుంటే..నవ్వు తెప్పిస్తోంది. ఎక్కడ ఎన్ని పరిశ్రమలు వచ్చాయో తెలియదు. కెసిఆర్ లాగా తమది ధనిక రాష్ట్రం అన్నట్లుగా ఉంది. ముఖ్యమంత్రి జగన్ రాజకీయ ఒడిదుడుకులు ఇంకా ఎదుర్కో లేదు. కారణం టిడిపి కూడా బలంగా లేకపోవడమే. పోలీసులను, అధికార వ్యవస్థను అడ్డం పెట్టుకుని ఎన్నికల్లో ఫలితాలను ఏకపక్షం చేసుకుంటున్నారు. దీంతో ప్రజలు కూడా తమవైపే ఉన్నారని అధికార పార్టీ నాయకులు చెప్పుకుంటున్నారు. నిజానికి క్షేత్రస్థాయిలో పరిస్థితులు అధికార పార్టీకి అంత అనుకూలంగా ఏమీ లేవు. అధికారంతోపాటు డబ్బు కూడా పుష్కలంగా ఉన్నందున ఎన్నికల ఫలితాలు అధికార పార్టీకి అనుకూలంగానే ఉంటాయి. అయితే పరిస్థితులు ఎల్లవేళలా ఒకేరీతిన ఉండకపోవచ్చు. మున్ముందు మరింత దారుణంగా ఉంటాయనడానికి కూడా సందేహం లేదు. అభివృద్ధి కుంటుపడితే అన్నివిధాల నష్టపోయేది రాష్ట్రమే అని పాలకుల గుర్తించాలి. అందుకు పాలకులు తమ విధానాలను మార్చుకుంటే మంచిది. వచ్చే ఎన్నికల్లో ప్రజలు ఎలా స్పందిస్తారన్నది కూడా ముఖ్యం.

## తాబేలు లాంటి నిగ్రహం ఉండాలి!

**తిరుమల, మార్చి 9 (పీపుల్స్ మోటివేషన్) :**

తాబేలు పరిస్థితులకు అనుగుణంగా, బాహ్య అవయవాలను లోలోప లికి దాచుకుంటూ అవసరమైనప్పుడు వెలికి తెచ్చుకుంటుంది. మనిషి కూ డా స్థిరచిత్తంతో, లౌకిక అనుభూతులు కలిగించే ఉద్రేకాలపై, అదే విధంగా నియంత్రణ సాధించుకోవచ్చంటారు మహాత్ములు. జ్ఞానేంద్రియా లన్నింటిపై పట్టు సాధించుకొమ్మంటారు. స్థిరబుద్ధి లేని మనిషి తన మూలాలు ఎక్కడున్నాయో తెలుసుకోలేడు. అహంభావనలు అదుపు తప్పు తుంటాయి. ప్రతికూల అనుభవాలను జీర్ణించుకోలేడు. తనను విమర్శించే వారంతా శత్రువులనుకుంటాడు. జన్మనిచ్చిన తల్లిదండ్రులైనా, జ్ఞాన ప్రదాతలు గురువులైనా తనతో ఆనందాన్ని పంచుకుంటూ తన హితాన్ని కోరుకునేదెవరైనా, వారు చెబుతున్నదంతా అతడికి లోప భూయిష్ఠంగానే అనిపిస్తుంది. తప్పులు చేస్తూ అవి చిన్నవేనని సరిపెట్టుకుంటాడు. సరిదిద్దుకోలేని పెద్ద తప్పులూ చేస్తుంటాడు. ప్రలోభాలకు లొంగిపోతాడు.స్థిరబుద్ధితో వచ్చే విశిష్టమైన లక్షణాలు మనుషులకు ప్రత్యేకమైన గుర్తింపు తెస్తాయి. స్వశక్తిపై నమ్మకం పెంచుతాయి. వానరుడైనా తన బుద్ధికి ఉన్న స్థిరత్వంతో హనుమంతుడు బుద్ధిమంతుల్లోనే వరిష్ఠుడు అనిపించుకుని కార్యసాధకుడిగా కీర్తిమంతుడయ్యాడు.

# కులాంతర వివాహం చేసుకుందని సోదరి భర్త దారుణహత్య

**బిజ్నోర్, మార్చి 9 (పీపుల్స్ మోటివేషన్) :**

సోదరి కులాంతర వివాహం చేసుకుందని పగ పెంచుకున్న వ్యక్తి, ఆమె భర్తను కాల్చి చంపాడు. ఈ ఘటన ఉత్తర్ ప్రదేశ్ రాష్ట్రంలోని బిజ్నోర్‌లో చోటు చేసుకుంది.ఈ కేసులో నిందితుడిని అరెస్ట్ చేసినట్లు పోలీసులు శనివారం తెలిపారు. బిజ్నోర్‌లోని చాంద్‌పూర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని మీరాపూర్ ఖాదర్ గ్రామంలో నిన్న రాత్రి హత్య జరిగింది. బాధితుడిని చాంద్‌పూర్‌లో నివాసం ఉంటున్న బ్రజేష్ సింగ్‌గా గుర్తించారు.బ్రజేష్ సింగ్ అదే గ్రామానికి చెందిన దివ్యని ప్రేమించి పెళ్లి చేసుకున్నాడు. వీరి వివాహాన్ని దివ్య కుటుంబం అంగీకరించలేదు. దీంతో ఇద్దరు పారిపోయారు. బ్రజేష్‌తో దివ్య సోదరుడు లవ్‌సిత్ స్నేహంగా ఉండేవాడు. అయితే, తన సోదరిని వివాహం చేసుకోవడంతో అతనిపై పగ పెంచుకున్నాడు. దివ్య కుటుంబం జనవరి 5, 2023న చాంద్‌పూర్ పోలీస్ స్టేషన్‌లో ఈ విషయమై కేసు కూడా నమోదు చేసింది. పెళ్లి తర్వాత చాలా నెలలుగా గ్రామానికి దూరంగా ఉన్న ఈ జంట, ఇటీవల తిరిగి గ్రామానికి వచ్చింది. శుక్రవారం రాత్రి బ్రజేష్ ఒంటరిగా కనిపించడంతో లవ్‌సిత్, అతని సహచరులు అతడిని కాల్చి చంపారు. బ్రజేష్ షెడ్యూల్డ్ కులానికి చెందిన వాడు కాగా, దివ్య ఓ సైనీ అని, ఇరువురు ఏడాది క్రితం వివాహం చేసుకున్నారని, దీంతో ఇరు కుటుంబాల మధ్య ఉద్రిక్తత పెరిగిందని ఎస్పీ నీరజ్ కుమార్ జాదౌన్ తెలిపారు. ఈ కేసులో ప్రధాన నిందితుడు లవ్‌సిత్‌ని అరెస్ట్ చేయగా, అతని సహచరుల కోసం గాలిస్తున్నారు.

# పాలకుల తీరుపై చైతన్యం కావాలి !

ఒక్కసారి అధికారం చేపడితే మరోమారు దానిని కాపాడుకుని ఓట్లు పొందదమెలా అన్న సూత్రం..అన్నీ రాజకీయ పార్టీలు అవలంబిస్తున్నాయి. ఇందుకు బిజెపి భిన్నంగా ఏమీ లేదు. ప్రాంతీయ పార్టీల తీరులోనే బిజెపి కూడా ఆలోచిస్తోంది. గత పదేళ్లుగా అధికారంలో ఉన్న బిజెపి మరోమారు కేంద్రంలో పగ్గాలు దక్కించుకోవాలన్న లక్ష్యంతో అడుగులు వేస్తోంది. ఎన్‌డిఎలో కొత్త మిత్రులను చేర్చుకోవాలని ఉబలాట పడుతోంది. అలాగే పదేళ్లు అధికారానికి దూరంగా ఉన్న కాంగ్రెస్ ఇండియా కూటమితో గద్దెనెక్కాలని చూస్తోంది సిద్ధాంతపరమైన విభేదాలు ఉన్నా ..కలసివచ్చే ప్రాంతీయ పార్టీలను కలుపుకుని ముందుకు సాగుతోంది. కూటమిలోని ప్రాంతీయ పార్టీల డిమాండ్లకు తలొగ్గి పనిచేస్తోంది. ఇకపోతే గత ఐదేళ్లుగా ఎపిలో చేతికి ఎముకే లేదన్న చందంగా ఖజానాను ఊడ్చిపెట్టిన జగన్ ఇప్పుడు మరోమారు అధికారం కోసం ఎత్తులు పైఎత్తులు వేస్తున్నారు. నిజానికి రాష్ట్రం అభివృద్ధి జరిగివుంటే ప్రజలు అడక్కుండానే ఓట్లేస్తారు. కేవలం డబ్బులు పంచడమే పాలన అన్న చందంగా జగన్ పాలన సాగింది. దీంతో ఎపి కూడా అప్పులకుప్పగా మారింది. తెలంగాణలె నీళ్లు, నిధులు, నియామకాలు అంటూ ఊదరగొట్టి ప్రజలను వంచించిన కెసిఆర్‌ను, ఆయన పార్టీని ప్రజలు మొన్నటి ఎన్నికల్లో దించేసారు. ఇప్పుడు ఎంపి ఎన్నికల్లో నాలుగైదు సీట్లు సంపాదిస్తే తప్ప ప్రజలు ఆదరించరు. నాయకులు కలసి ఉండరు. అందుకే కెసిఆర్ ఊతకర్ర పట్టుకుని అడుగులు వేస్తున్నారు. రాజకీయ నాయకుల సరికొత్త రాజకీయాల కారణంగా ప్రజల సమస్యలు పక్కకు పోతున్నాయి. రాజకీయనేతలు..వారి సమస్యలు ప్రధాన ఎజెండాగా మారుతున్నాయి. రాజకీయాల్లో కక్షసాధింపు వ్యవహారాలు మిన్నంటాయి. కేంద్రంలో అధికారంలో ఉన్న బిజెపి అయినా.. ప్రాంతీయ పార్టీల ఏలుబడిలో ఉన్న రాష్ట్రాల్లో అయినా కక్షసాధింపు రాజకీయాలు సాగుతున్నాయి. తమ ఆలోచనలకు అనుగుణంగా సాగడం..ప్రజల గురించి పట్టించుకోక పోవడం.. ప్రశ్నించిన వారిని కేసులు పెట్టి వేధించడం పరిపాటిగా మారింది. ఎపిలో అయితే దాడులు, కేసులు, హత్యలు నిత్యకృత్యంగా మారాయి. తాజాగా వివేకానంద కేసులతో అప్రూవర్‌గా ఉన్న దస్తగిరి తండ్రిపై దాడి జరిగింది. ఇలా చెప్పుకుంటూ పోతే అనేకం ఉన్నాయి. నేతల్లో నిజాయితీ లోపించిందన్నది నూటికినూరుపాళ్లు నిజం. నిజానికి అవినీతి కావచ్చు, అక్రమాలు కావచ్చు... అందరినీ ఒకే గాటన కట్టే పాలన రావాలి. రాజకీయ లబ్ది కోసం చేసే ప్రయత్నాలను ప్రజలు ఎప్పుడూ హర్షించరని గుర్తించాలి. బెయిల్‌పై ఉన్న జగన్ సిఎం గద్దెనెక్కినా ఎందుకు చర్యలు తీసుకోవడం లేదో చెప్పాలి. ఇలా అనేకానేక కేసులను పక్కన పెట్టారు. బ్యాంకులను దోచుకున్న వారు ఎందరో దర్జాగా తిరుగుతున్నారు. అందుకే తమైదన రీతిలో పాలనలో రాటుదేలిన పాలకులు ప్రజా ఉద్యమాలకు పెద్దగా జంకడం లేదు. వాటిని కఠినంగా అణచివేసే విధానాలు బాగా వంటబట్టించుకున్నారు. తమ విధానాలతో కార్పోరేట్ సంస్థలకు లబ్ది చేకూర్చే లక్ష్యంతో పాలనా వ్యవహారాలను నడుపుతున్నారు. రాష్ట్రాల్లో కాంట్రాక్టర్లకు కొమ్ము కాస్తున్నారు. వారికి పనులు అప్పగిం చడం..అందులో లాభాలు పొందడం అలవాటు చేసుకున్నారు. కాళేశ్వరం అవినీతిలో ఇదే జరిగింది. కార్పోరేట్ సంస్థలు విదులుస్తున్న డబ్బులతో అధికారంలోకి రావడ.. వారి కోసం ప్రభుత్వ పరంగా చేయాల్సని పనులు చక్కబెట్టడం రివాజు గా మారింది. ప్రాంతీయ పార్టీలైనా, దేశభక్తిని నరనరాన జీర్ణించుకున్నానని బీరాలు పలికే బిజెపి అయినా.. కార్పోరేట్లకు దాసోహం అంటోంది. ఎన్నికలకు ముందు ప్రజలను మచ్చిక చేసుకోవడం.. డబ్బులు పంచడం...అధికారంలోకి వచ్చాక ప్రజలను నట్టేట ముంచే పనులు చేయడం దేశంలో అలవాటుగా మారింది. దీనికి ఘనమైన ప్రజాస్వామ్య ముసుగు వేస్తున్నారు. అమరావతి రాజధానిని కొనసాగించాలని రైతులు ఉద్యమిస్తున్నా సిఎం జగన్ పట్టించుకోవడం లేదు. ఉద్యోగాలు భర్తీ చేయండనో లేదా ఉద్యమ ఆకాంక్షలు నెరవేర్చాలని తెలంగాణలో చేస్తున్న ఆందోళనలను గులాబీ బాస్ కెసిఆర్ ఖాతరు చేయలేదు. దేశవ్యాప్తంగా ఏ రాష్ట్రంలో అయినా ఏ ప్రభుత్వం ఉన్నా.. ప్రజాందోళనలను పట్టించుకోక పోవడం అన్నది ఓ విధానంగా మారింది. తాము పట్టిన కుందేటికి మూడే కాళ్లు అన్న చందంగా..తమకు అనుకూల మైన విధానాలను అవలంబిస్తూ ప్రజా సంక్షేమం అన్న ముసుగు కప్పి అధికారం చెలాయిస్తున్నారు. ప్రాంతీయ పార్టీలు అయినా,జాతీయ పార్టీలు అయినా, కమ్యూనిస్టులు అయినా భారతగడ్డపై ప్రజల కోసం పాటుపడే పార్టీలులేవని తేలిపోయింది. మనపాలకులు బ్రిటిషర్ల కన్నా దారుణమైన అణచివేత విధానాలను అలవర్చుకున్నారు. వారి కన్నా కొంచెం కనికరముండేదేమో.. అభివృద్ధి పట్ల వారికున్న చిత్తశుద్ధి నేటి పాలకులకు లేకపోవడం విచారకరం. విశాఖ ఉక్కును ప్రైవేటుపరం చేయాలన్న కేందప్రభుత్వ నిర్ణయానికి వ్యతిరేకంగా గట్టిగా పోరాడాలనే సంకల్పం వైసీపీ ప్రభుత్వానికి ఏ కోశాన కూడా లేదు. విశాఖ రైల్వేజోన్ గాలికి పోయింది. ప్రత్యేక హోదా ఊసే లేదు. అయినా ప్రజలకు ఆ స్పృహ కూడా లేదు. ఉన్నా పోరాడే శక్తి లేదు. పోరాడినా పోయేవి ప్రాణాలే తప్ప మరోటి కాదని పాలకులు తేల్చేశారు. ఆందోళనలను పట్టించుకోవడం లేదు. అందుకు అమరావతి, రైతు ఉద్యమం నిదర్శనంగా చూడాలి. ప్రజాందోళనలను పట్టించుకోక పోవడం అన్నది తెలంగాణలో కెసిఆర్ రాకతో మొదలయ్యిందనే చెప్పాలి. ప్రజాందోళనలు పట్టించుకోక పోవడం, ఖాతరు చేయకపోవడం అన్నది అలవాటుగా చేసుకున్నారు. ఎన్నికలప్పుడు ప్రజలు గొర్రెల్లాగా ఓట్లు వేస్తారని కూడా ప్రగాఢమైన నమ్మకం తో ఉన్నారు. ప్రజల ఆందోళనలతో ప్రభుత్వాలను నిలదీ యడం సాధ్యం కాదని కూడా ప్రజలు గుర్తించా లి. ఓటు వేసే సమయంలో పడ్డ కక్కుర్తి కారణంగా ప్రజలు మోసపోతున్నామని గుర్తించినప్పుడే ప్రజాస్వామ్యం బలపడుతుంది. నిజాయితీ కలిగిన నేతలను గుర్తించాలి. అందుకు ఓటర్లు ముందుగా చైతన్యం కావాలి.

# కాంగ్రెస్‌కు.. మరోసారి ఎదురుదెబ్బ

- **సురేశ్ పచౌరీ, మాజీ ఎంపీ గజేంద్ర సింగ్‌ల టాటా**
- **పార్టీని వీడి బిజెపిలో చేరిన సీనియర్ నేతలు**

**భోపాల్, మార్చి 9 (పీపుల్స్ మోటివేషన్) :**

లోక్‌సభ ఎన్నికలకు ముందు కాంగ్రెస్‌కు మరోసారి ఎదురు దెబ్బ తగిలింది. గాంధీ కుటుంబానికి అత్యంత సన్నిహితులైన కేంద్ర మాజీ మంత్రి సురేశ్ పచౌరీ, మాజీ ఎంపీ గజేంద్ర సింగ్ కాంగ్రెస్‌ను వీడి భారతీయ జనతా పార్టీలో చేరారు. మధ్యప్రదేశ్ ముఖ్యమంత్రి డాక్టర్ మోహన్ యాదవ్, రాష్ట్ర బీజేపీ అధ్యక్షుడు వీడీ శర్మ, మాజీ సీఎం శివరాజ్ సింగ్ చౌహాన్ సమక్షంలో కాంగ్రెస్ నేతలు బీజేపీ సభ్యత్వం తీసుకున్నారు. కాంగ్రెస్ నాయకుడు సురేష్ పచౌరీని ఆ పార్టీ మూడుసార్లు రాజ్యసభకు పంపింది. 1990 96 మధ్య రాజ్యసభ సభ్యుడు, రెండోసారి 1996 2002 వరకు రాజ్యసభ సభ్యుడిగా ఉన్నారు. 2002 నుండి 2008 వరకు మూడోసారి పెద్దల సభకు పంపింది కాంగ్రెస్ పార్టీ. రెండు సార్లు కేంద్ర మంత్రిగా పనిచేశారు. యువజన కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షుడిగా, కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షుడిగా కూడా ఉన్నారు. కాంగ్రెస్‌కు చెందిన ప్రముఖ నాయకుడు సురేష్ పచౌరి గాంధీ కుటుంబానికి సన్నిహితుడిగా పేరుంది. పచౌరీ 1981 83లో మధ్యప్రదేశ్ యూత్ కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శిగా, 1984 85లో మధ్యప్రదేశ్ యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడిగా, 1985 88లో ఇండియన్ యూత్ కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శిగా, 1984 90లో రాజ్యసభ సభ్యుడిగా ఉన్నారు. 1990లో హోం, రక్షణ మంత్రిత్వ శాఖ కన్సల్టేటివ్ కమిటీ సభ్యుడు, 1990 96లో రాజ్యసభ సభ్యుడు, 1995 96లో కేంద్ర రక్షణ ఉత్పత్తి శాఖ సహాయ మంత్రి, 1996 2002 సంవత్సరంలో రాజ్యసభ సభ్యుడు, 2000 సంవత్సరంలో రాజ్యసభ డిప్యూటీ ఛైర్మన్ (ప్యానెల్), 2002 2008లో రాజ్యసభ సభ్యుడు, 2004లో చీఫ్ విప్ రాజ్యసభ సభ్యుడు, 2004 2008 మధ్య కాలంలో పర్సనల్, పబ్లిక్ గ్రీవెన్స్, పెన్షన్లు, పార్లమెంటరీ వ్యవహారాల మంత్రిత్వ శాఖలో సభ్యులుగా కొనసాగారు. 2008 2011లో మధ్యప్రదేశ్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడుగా బాధ్యతలు నిర్వహించారు. కాంగ్రెస్‌లోని ముఖ్య నాయకులందరూ బీజేపీలో చేరుతున్నారని మాజీ సీఎం శివరాజ్‌సింగ్ చౌహాన్ తెలిపారు. కాంగ్రెస్ నాయకత్వం దిక్కులేనిదిగా అభివర్ణించారు. స్వాతంత్ర్యం తర్వాత మహాత్మా గాంధీ కాంగ్రెస్ స్వాతంత్ర్య ఉద్యమమని, కాంగ్రెస్‌ను వెంటనే రద్దు చేయాలని, కొత్త పార్టీ పెట్టుకోవాలని సూచించారన్నారు. కానీ పండిట్ జవహర్‌లాల్ నెహ్రూ అధికార స్వార్థంతో కాంగ్రెస్‌ను రద్దు చేయకుండా ఉద్యమాన్ని రాజకీయంగా ఉపయోగించుకున్నారని ధ్వజమెత్తారు శివరాజ్ సింగ్ చౌహాన్. 'జవహర్‌లాల్ నెహ్రూ మహాత్మా గాంధీ కోరికను నెరవేర్చలేదు, కానీ రాహుల్ గాంధీ ఈ కోరికను నెరవేర్చిన తర్వాత మాత్రమే నిట్టూర్పు విడిచిపెడతారు. కాంగ్రెస్ నాయకత్వంతో విసిగిపోయిన వారి ముఖ్య నాయకులు ఒక్కొక్కరుగా బీజేపీలో చేరుతున్నారు అని శివరాజ్ సింగ్ చౌహాన్ తెలిపారు.

# గుండెపోటుతో సెకండ్ క్లాస్ విద్యార్థి మృతి

**ఫిరోజాబాద్, మార్చి 9 (పీపుల్స్ మోటివేషన్) :**

ఈ మధ్య ఎన్నడూ లేని విధంగా చావు కబుర్లు వినాల్సి వస్తోంది. చిన్న వయసులోనే నిండు నూరేళ్లు నిండిపోతున్నాయి. ఇంతక ముందు ఇలాంటి వార్తలు ఎప్పుడూ కానరాలేదు. కానీ ఈ మధ్య అన్ని ఇలాంటి వార్తలే వినాల్సి వస్తోంది. చిన్న వయసులోనే గుండెపోటులు రావడమేంటో అర్థం కావడం లేదు. హఠాత్తు మరణాలు కన్నపేగుకు కడుపుకోత మిగిలిస్తున్నాయి. పట్టుమని పదేళ్లు కూడా లేవు. కానీ ఓ విద్యార్థి స్కూల్ ఆవరణలోనే కుప్పకూలి ప్రాణాలు వదిలాడు. ఈ ఘోర విషాదం ఉత్తరప్రదేశ్‌లోని ఫిరోజాబాద్‌లో చోటుచేసుకుంది. ఫిరోజాబాద్‌లో హన్స్ వాహిని పాఠశాలలో శనివారం మధ్యాహ్నం భోజన సమయంలో విద్యార్థులంతా సంతోషంగా స్కూల్ ఆవరణలో ఆడుకుంటున్నారు. అంతే ఉన్నట్టుండి రెండో తరగతి చదువుతున్న చంద్రకాంత్ (8) అనే బాలుడు కుప్పకూలిపోయాడు. తోటి స్నేహితులు పైకి లేపే ప్రయత్నం చేశారు. కానీ అప్పటికే ఆ చిన్నారి ప్రాణాలు వదిలేశాడు. ఈ ఘటన పాఠశాలలోని సీసీటీవీ కెమెరాలో రికార్డైంది. ఇందుకు సంబంధించిన వీడియో ఇప్పుడు సోషల్ మీడియాలో చక్కర్లు కొడుతోంది. చంద్రకాంత్ పరిగెత్తుతుండగా అకస్మాత్తుగా పడిపోయాడు.. సహ విద్యార్థులు లేపే ప్రయత్నం చేసినా లేవలేదు. స్కూల్ టీచర్లు వెంటనే అతడిని ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు ప్రకటించారు. అతని మరణానికి కచ్చితమైన కారణం తెలియనప్పటికీ.. గుండెపోటుగా తెలుస్తోంది. చిన్నారి ఆకస్మిక మృతితో తల్లిదండ్రులు, బంధువులు కన్నీరుమున్నీరు విలపించారు. ఇదిలా ఉంటే వీడియో చూస్తుంటే.. సమయం మిట్ట మధ్యాహ్నం కావడం.. పైగా వేసవి కాలం. సూర్యుడు సుర్రుమంటున్నాడు. ఆ సమయంలో చిన్న పిల్లలంతా ఆడుకుంటున్నారు. వడదెబ్బ తగిలి స్పృహ తప్పిపడిపోయినట్లుగా విజువల్స్‌లో స్పష్టంగా కనబడుతుంది. వాస్తవానికి ఆ సమయంలో విద్యార్థులను ఆడుకోనివ్వకూడదు. కానీ భగభగమండే ఎండలో ఆడుకోవడంతో ఎండ వేడిమికి స్పృహ కోల్పోయాడు. చిన్న వయసులో తల్లికి కడుపుకోత మిగిల్చి వెళ్లిపోయాడు. ఇకనైనా మధ్యాహ్న సమయాల్లో పిల్లల్ని ఎండల్లో ఆడనివ్వకుండా చూస్తే బాగుంటుందని నెటిజన్లు కోరుతున్నారు.

తెలుగు దినపత్రిక
పీపుల్స్ మోటివేషన్
People's Motivation

# మెజార్టీ సీట్లు లక్ష్యంగా బీజేపీ అడుగులు

**సీతారాం నాయక్, జలగం ప్రసాద్‌లకు గాలం**

**ఇద్దరూ చేరితే మహబూబాబాద్, ఖమ్మంలలో పోటీ**

**హైదరాబాద్, మార్చి 9 (పీపుల్స్ మోటివేషన్) :**

ఓ వైపు తెలంగాణలో 17కు 17 సీట్లు గెలవాలన్న లక్ష్యంతో ఉన్న బిజెపి అందుకు అనుగుణంగా అడుగులు వేస్తోంది. బలమైన అభ్యర్థులను చేర్చుకోవడం ద్వారా రంగంలోకి దిగుతోంది. ఈ క్రమంలో తాజాగా మహబూబాబాద్ నుంచి ప్రొఫెసర్ సీతారాం నాయక్ పోటీ దాదాపుగా ఖాయం అయినట్లే. అలాగే ఖమ్మం నుంచి కూడా జలగం ప్రసాద్ పేరు దాదాపు ఖరారు అయినట్లేనని అంటున్నారు. ఢిల్లీలో అత్యవసరంగా సమావేశం అవుతున్న బిజెపి కేంద్రకమిటీ తెలంగాణ రెండోజాబితాను ఖరారు చేస్తుందని తెలుస్తోంది. ఇందుకోసం బిజెపి అధ్యక్షుడు కిషన్‌రెడ్డికి పిలుపు వచ్చింది. బహుశా ఆదివారం రెండో జాబితా ఖరారు కానుంది. పార్లమెంట్ ఎన్నికల తరుణంలో తెలంగాణ రాజకీయాల్లో వలసలు హాట్‌టాపిక్‌గా మారాయి. ప్రతిపక్ష బీఆర్ఎస్ నేతలకు బీజేపీ గాలం వేస్తోంది. ఇప్పటికే నాగర్ కర్నూల్ బీఆర్ఎస్ ఎంపీ రాములు, జహీరాబాద్ ఎంపీ బీబీ పాటిల్‌ను తమ పార్టీలో బీజేపీ చేర్చుకుంది. లోక్‌సభ ఎన్నికల్లో బలపడేందుకు బీఆర్ఎస్‌లోని మరికొంతమంది కీలక నేతలను పార్టీలోకి బీజేపీ ఆహ్వానిస్తోంది. బీఆర్ఎస్‌ను బలహీనం చేయడం ద్వారా ఆ పార్టీ ఓట్లు తమవైపు మళ్లుతాయని కమలదళం ఆశిస్తోంది. బీఆర్ఎస్ బలహీనపడేలా చేసేందుకు ఆ పార్టీని నేతలను చేర్చుకుంటోంది. అందులో భాగంగా తాజాగా బీఆర్ఎస్ మాజీ ఎంపీ సీతారాం నాయక్‌ను చేర్చుకునేందుకు చర్చలు జరుపుతోంది. మహబూబాబాద్ బీఆర్ఎస్ మాజీ ఎంపీ సీతారాం నాయక్‌తో కేంద్రమంత్రి కిషన్ రెడ్డి భేటీ అయ్యారు. హనుమకొండలోని సీతారాం నివాసానికి వెళ్లిన కిషన్ రెడ్డి.. ఆయనతో చర్చలు జరిపారు. బీజేపీలో చేరితే తగిన ప్రాధాన్యం ఇస్తామంటూ ఆయనను పార్టీలోకి ఆహ్వానించారు. దీనికి అనుగుణంగా సానుకూలా నిర్ణయం తీసుకుంటానంటూ కిషన్ రెడ్డికి సీతారాం నాయక్ చెప్పినట్లు తెలుస్తోంది. సీతారమ్ నాయక్ కూడా బిఆర్ఎస్ నాయకత్వంతో విముఖంగా ఉన్నారు. ఆయనను పార్టీ ఇప్పటి వరు దూరం పెడుతూ వచ్చింది. రాజ్యసభ, ఎమ్మెల్సీ ఆశ చూపినా నెరవేర్చలేదు. దీంతో ఆయన బిజెపిలో చేరి అదష్టాన్ని పరీక్షించుకోవాలని చూస్తున్నారు. ఇప్పటికే పలువురు బీఆర్ఎస్ ఎంపీలు బీజేపీలో చేరిన క్రమంలో.. సీతారాం నాయక్‌ను స్వయంగా కిషన్ రెడ్డి కలిసి పార్టీలోకి ఆహ్వానించడం చర్చనీయాంశంగా మారింది. సీతారాం నాయక్ పార్టీ మారే అవకాశముందనే ప్రచారం జరుగుతోంది. ఇటీవల జరిగిన రాజ్యసభ ఎన్నికల్లో బీఆర్ఎస్ నుంచి పెద్దల సభకు వెళ్లాలని సీతారాం నాయక్ భావించారు. కానీ మళ్లీ వద్దిరాజు రవిచంద్రకే కేసీఆర్ అవకాశం కల్పించారు. దీంతో గత కొంతకాలంగా బీఆర్ఎస్‌లో అసంతృప్తితో ఉన్న సీతారాం నాయక్.. ఆ పార్టీ కార్యక్రమాల్లో కూడా ఎక్కడా పాల్గొనడం లేదు. దీంతో వేరే పార్టీలోకి జంప్ అవుతారనే ప్రచారం జరుగుతున్న క్రమంలో కిషన్ రెడ్డితో భేటీ కావడం హాట్‌టాపిక్‌గా మారింది.సీతారాం నాయక్ 2014 ఎన్నికల్లో బీఆర్ఎస్ నుంచి మహబూబాబాద్ ఎంపీగా గెలిచారు. కాంగ్రెస్ అభ్యర్థి బలరాం నాయక్‌పై 34, 992 ఓట్ల మెజార్టీతో గెలిచారు. ఆ ఎన్నికల్లో సీతారాం నాయక్‌కు 3.20,569 ఓట్లు రాగా.. కాంగ్రెస్ నుంచి పోటీ చేసిన బలరాం నాయక్‌కు 2,85,577 ఓట్లు పోలయ్యారు. ఇక టీడీపీ నుంచి బరిలోకి దిగిన బానోతు మోహన్‌లాల్‌కు 2,15,904 ఓట్లు వచ్చాయి. అయితే 2019 లోక్‌సభ ఎన్నికల్లో మహబూబాబాద్ నుంచి మాలోత్ కవితకు బీఆర్ఎస్ సీటు కేటాయించగా.. ఆమె గెలుపొందింది. కాంగ్రెస్ అభ్యర్థి బలరాం నాయక్‌పై 25,487 ఓట్ల మెజార్టీతో ఆమె విజయం సాధించారు. బీఆర్ఎస్ అధికారంలో ఉన్న సమయంలో ఏదైనా నామినేటెడ్ పదవి కూడా సీతారాం నాయక్‌కు ఇవ్వలేదు. రాజ్యసభ సీటు కూటా కేటాయించకపోవడంతో అసంతృప్తితో ఉన్నారు. తాజాగా మరోమారు మాలోత్ కవితకు సీటు ఇచ్చారు. మహబూబాబాద్ ఎంపీ అభ్యర్థి కోసం బీజేపీ కసరత్తు చేస్తోంది. సీతయ్య, హుస్సేన్ నాయక్ పేర్లను పరిశీలిస్తోంది. అయినా మరింత బలమైన నేత కోసం బీజేపీ వెతుకులాట మొదలుపెడుతుంది. అందులో భాగంగా సీతారాం నాయక్‌ను కిషన్ రెడ్డి సంప్రదించినట్లు తెలుస్తోంది. ఆయన పార్టీలో చేరితే టికెట్ కేటాయించే అవకాశాలు కనిపిస్తున్నాయి. ఈ క్రమంలో ఖమ్మం నుంచి మాజీ సిఎం జలగం వెంగళరావు తనయుడు, మాజీ ఎమ్మెల్యే జలగం ప్రసాదరావు కూడా బిజెపికి టచ్‌లో ఉన్నారు. మాజీ సిఎం కిరణ్ కుమార్ రెడ్డి ద్వారా ఆయన మంతనాలు జరిపినట్లు సమాచారం. ఆమన కూడా ఖమ్మంలో బలమైన అభ్యర్థి కాగలడని బిజెపి యోచిస్తోంది.

# మెదక్ ఎంపీగా.. కేసీఆర్ పోటీ ఖాయమా ?

**ఆచితూచి అడుగులు వేస్తున్న బీఆర్ఎస్**

**బీఆర్ఎస్ అభ్యర్థి ఎవరన్నది చూస్తున్న కాంగ్రెస్**

**బీజేపీ కూడా వేచిచూసే ధోరణి**

**మెదక్, మార్చి 9 (పీపుల్స్ మోటివేషన్) :**

ఓ వైపు లోక్‌సభ ఎన్నికలు దగ్గరపడుతున్న వేళ మెదక్‌పై మరోమారు అందరి దృష్టి పడింది. ఇక్కడి నుంచి కెసిఆర్ పోటీ చేస్తారని ప్రచారం జరగడం, ఈ సీటును బిఆర్ఎస్ ఎవ్వరికీ కేటాయించకపోవడంతో... అనుమానాలు బలపడుతున్నాయి. ఒకవేళ కెసిఆర్ పోటీకి దిగితే తగిన అభ్యర్థిని రంగంలోకి దింపాలని కాంగ్రెస్, బిజెపలు ఆలోచిస్తున్నాయి. అందుకే ఈ పార్లమెంట్ పరిధిలో ఇరుపార్టీల నేతలు సైలెంట్ అయ్యారు. గతంలో కొంత హడవుడి చేసిన నాయకులు ఇప్పుడు ఉలుకు, పలుకు లేకుండా చాలా సైలెంట్‌గా ఉంటుడడంతో కెసిఆర్ పోటీ ఖాయమన్న సంకేతాలు వస్తున్నాయి. అదే జరిగితే..ఎవరు అభ్యర్థి అన్నది ఆలోచనలో ఉన్నారు. బిజెపిలో అయితే రఘునందన్ రావును రంగంలోకి దింపుతుందని ప్రచారం సాగుతోంది. ఈ క్రమంలో కాంగ్రెస్ పార్టీ కార్యకర్తల్లో టెన్షన్ పెరిగిపోతుందని అంటున్నారు. అందుకే మెదక్ పార్లమెంట్ పరిధిలోని కాంగ్రెస్ పార్టీ ఆచితూచి అడుగులు వేస్తోంది. ఇక్కడ ముందే అభ్యర్థిని ప్రకటించకుండా గోప్యతను పాటిస్తోంది. రాష్ట్రం ఏర్పాటు అయ్యాక 10 సంవత్సరాల తర్వాత కాంగ్రెస్ అధికారం దక్కించుకుంది. ఎంపీ ఎన్నికలు దగ్గరపడుతున్న వేళ మిగతా పార్టీల నేతలు మెదక్ పార్లమెంట్ పరిధిలో ఎదో ఒక కార్యక్రమం చేస్తూ, నిత్యం జనాల్లో ఉండే ప్రయత్నాలు చేస్తుంటే, ఇక్కడి కాంగ్రెస్ నేతలు మాత్రం ఎంపీ ఎన్నికలే కాదా చూద్దాంలే అని అంటున్నారు. కెసిఆర్ రంగంలో ఉంటే కాంగ్రెస్ అభ్యర్థి ఎవరన్నది ఇప్పుడు లోక్ సభ నియోజకవర్గం పరిధిలో పెద్ద చర్చనీయాంశంగా మారింది. మెదక్ ఎంపీ టికెట్ కావాలని సీనియర్ నేతలు జగ్గారెడ్డి, మైనంపల్లి హన్మంతరావు లాంటి నేతలు ప్రయత్నాలు చేస్తున్నారన్న ప్రచారం జరిగింది. ఈ నేతలు కూడా మొన్నటి వరకు ఎదో ఒక పేరుతో మెదక్ పార్లమెంట్ పరిధిలోకి వెళ్లడం, మీడియాలో ఉండడం లాంటివి చేశారు. కానీ సడన్‌గా ఏమైందో తెలియదు కానీ, అందరూ సైలెంట్ అయ్యారు. మైనంపల్లి హన్మంతరావు గతంలో కొంత హంగామా చేసినా, ఇప్పుడు అది కూడా లేదు. ఆయన మల్కాజిగిరి ఎంపి సీటు కోసం ప్రయత్నాల్లో ఉన్నాడని అంటున్నారు. మెదక్ పార్లమెంట్ పరిధిలో కాంగ్రెస్ పార్టీ పరిస్థితి మెరుగ్గానే ఉంది. మొన్న జరిగిన శాసనసభ ఎన్నికల్లో కూడా మెదక్ పార్లమెంట్ పరిధిలో మొత్తం ఏడు అసెంబ్లీ స్థానాలు ఉండగా, అందులో కాంగ్రెస్ పార్టీ కేవలం ఒక్క సీట్ మాత్రమే గల్చుకుంది. కానీ రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడంతో ఇక్కడ ఉన్న కార్యకర్తలు నూతనోత్సాహంతో పనిచేయాలని తహతహలాడుతున్నారు. ఇతర పార్టీల నేతలు జిల్లాలోనే ఉంటూ.. కార్యకర్తలకు పలు సూచనలు చేస్తూ, నిత్యం జనాల్లో ఉంటుంటే, కాంగ్రెస్ నేతలు మాత్రం వారి కార్యకర్తలకు కూడా సరిగ్గా అందుబాటులోకి రావడం లేదట. అయితే అభ్యర్థిని ప్రకటిస్తే జోరు పెరిగే అవకాశం ఉంది.కెసిఆర్ రంగంలో ఉంటే బలమైన అభ్యర్థి ఎవరు అవుతారన్న చర్చ ఇప్పుడు ప్రధానంగా మారింది.

# ఇండియా కూటమిలో వయనాడ్ చిచ్చు

**సీపీఐకి ఎలా సర్ది చెబుతారన్నదే ప్రశ్న**

**న్యూఢిల్లీ, మార్చి 9 (పీపుల్స్ మోటివేషన్) :**

లోక్‌సభ ఎన్నికలు సమీపిస్తున్న వేళ కాంగ్రెస్ నేతృత్వంలోని విపక్ష ఇండియా కూటమిలో కొత్త వివాదం మొదలైంది. కేరళ వాయనాడ్ నియోజకవర్గం నుంచి సిట్టింగ్ ఎంపీ రాహుల్ గాంధీ మళ్లీ బరిలో ఉంటారని కాంగ్రెస్ తొలి జాబితా విడుదల చేసింది. దీంతో పొత్తు ధర్మాన్ని విస్మరించారన్న ప్రచారం మొదలయ్యింది. వాయనాడ్ నుంచి ఈసారి బరిలో ఉంటామని ఇప్పటికే సీపీఐ ప్రకటించడంతో మిత్రపక్షాల మధ్య పోరు తప్పేలా లేదు. సీపీఐ ప్రధాన కార్యదర్శి డి.రాజా భార్య అనీ రాజా ఇక్కడ పోటీ చేస్తారని ప్రచారం జరుగుతోంది. ఆమెకు ఎలా సర్ది చెబుతారన్నది కూడా ఇప్పుడు ముఖ్యం. సిపిఐ ఈ విషయంలో ఎలాంటి ప్రకటన చేస్తుందన్నది కూడా ముఖ్యం కానుంది. అయితే కాంగ్రెస్ తొలిజాబితా కూడా విడుదల కావడంతో సీపీఐ పోటీ నుంచి విరమించుకుంటుందా లేక బరిలో కొనసాగుతామని ప్రకటిస్తుందా అనేది తేలాల్సి ఉంది. 2019 లోక్‌సభ ఎన్నికల్లో అమేథీ, వాయనాడ్ నియోజకవర్గాల నుంచి రాహుల్ పోటీ చేశారు. నాటి ఎన్నికల్లో అమేథీలో రాహుల్‌ను బీజేపీ అభ్యర్థి స్మృతీఇరానీ ఓడించారు. అదే సమయంలో వయనాడ్‌లో భారీ మెజార్టీతో గెలుపొందారు. నాటి నుంచి నియోజకవర్గంపై పూర్తిగా దృష్టి సారించి భారీగా అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టారు. భావి ప్రధానిగా ఫోకస్ పెట్టిన కాంగ్రెస్ ఈ విషయంలో వెనక్కి తగ్గరాదని చూస్తోంది. కేరళలో కూడా ఇదే ప్రచారం అవుతోంది. రాహుల్ గెలిస్తే ఇక ప్రధాని అవుతారని మాట్లాడుతున్నారు. అయితే ప్రధాని మోదీపై వివాదాస్పద వ్యాఖ్యల నేపథ్యంలో వాయనాడ్ ఎంపీగా అనర్హత వేటు పడటం ఆ వెంటనే పునరుద్ధరణ జరడగం చకచకాజరిగిపోయాయి. పరువు నష్టం కేసులో దోషిగా నిలబడి వాయనాడ్ కోల్పోయే పరిస్థితి ఏర్పడినా కోర్టు తీర్పుతో రాహుల్‌కు రిలీఫ్ దక్కింది. దీంతో మరోమారు వాయనాడ్‌లో ఆయనకు అనుకూల పరిస్థితి ఏర్పడింది. ఇప్పటికే ఒక్కో రాష్ట్రంలో ఒక్కో వ్యూహంలా ఇండియా కూటమిలోని పక్షాలు పరస్పరం ఢీ కొంటున్నాయి. ఢిల్లీలో పొత్తు ఉన్నా ఆమ్ ఆద్మీ పార్టీ–కాంగ్రెస్ పంజాబ్‌లో పరస్పరం తలపడుతున్నాయి. ఇప్పుడు కేరళలో కూడా ఇండియా కూటమిలోని పక్షాలు అన్ని నియోజకవర్గాల్లో పరస్పరం తలపడతాయా లేక వయనాడ్ స్థానానికి మాత్రమే పరిమితమౌతాయా అనే విషయంలో ఒకటి రెండు రోజుల్లో స్పష్టత వచ్చే అవకాశముంది.

# మల్లారెడ్డికి ముందుంది ముసళ్ల పండగ

**అక్రమాలను బయటపడెతాం: మైనంపల్లి**

**మేడ్చల్, మార్చి 9 (పీపుల్స్ మోటివేషన్) :**

మాజీ మంత్రి మల్లారెడ్డి, ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డిల అక్రమాలన్నీ బయటపెడతామని, ఇది కేవలం శాంపిల్ మాత్రమేనని, అసలు కథ ముందున్నదని మాజీ ఎమ్మెల్యేలు మైనంపల్లి హన్మంతరావు, సుధీర్‌రెడ్డి, టీపీసీసీ ఉపాధ్యక్షుడు వజ్రేష్ యాదవ్, మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా డీసీసీ అధ్యక్షుడు హరివర్ధన్‌రెడ్డిలు తెలిపారు. చిన్నదామర చెరువు ఎఫ్‌టీఎల్‌లో రాజశేఖర్‌రెడ్డి అక్రమంగా నిర్మాణాలు కట్టాడని, కూల్చివేయాలని 2011లోనే బీజేపీ, సీపీఎం, బీఆర్ఎస్ వాళు ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు జేఏసీగా ఏర్పాటై కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారని వారు వివరించారు. హైకోర్టు ఆదేశాల ప్రకారం కూల్చివేతలు జరుగుతున్నాయని, కూల్చివేతలకు సీఎంకు గాని ఎవ్వరికి గాని ఎటువంటి సంబంధం లేదన్నారు. ఇదిలావుంటే అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్ ఘోర ఓటమిని చవిచూశాక పరిస్థితులు ఒక్కసారిగా మారిపోతున్నాయి. ఇప్పుడు పార్లమెంట్ ఎన్నికలే టా÷–గ్గ÷ట్‌గా అటు కాంగ్రెస్.. ఇటు బీఆర్ఎస్, బీజేపీలు సత్తా చాటడానికి వ్యూహ రచన చేస్తున్నాయి. ఈ క్రమంలో అటు నుంచి ఇటు.. ఇటు నుంచి అటు జంపింగ్‌లు చేస్తున్నారు. సరిగ్గా ఈ పరిస్థితుల్లో మాజీ మంత్రి మల్లారెడ్డి కూడా కాంగ్రెస్ తీర్థం పుచ్చుకోవడానికి సన్నాహాలు చేస్తున్నారన్న వార్త రాష్ట్ర రాజకీయాల్లో పెను సంచలనం అయ్యింది. అన్నీ అనుకున్నట్లు జరిగితే అతి త్వరలోనే బీఆర్ఎస్‌కు బై.. బై చెప్పేసి ఢిల్లీ వేదికగా కాంగ్రెస్ కండువా కప్పుకోనున్నారని అటు బీఆర్ఎస్.. ఇటు కాంగ్రెస్‌లో చర్చే జరుగుతోంది. దీనికి తోడు ఇలా వార్తలు వస్తున్నప్పుడే తెలంగాణ ప్రభుత్వ సలహాదారు వేం నరేందర్ రెడ్డితో భేటీ కావడం మరింత ప్రాధాన్యత సంతరించుకుంది. ఈ భేటీలో మల్లారెడ్డి కుమారుడు మహేందర్ రెడ్డి, అల్లుడు మర్రి రాజశేఖర్ రెడ్డి కూడా ఉండటం గమనార్హం. అయితే ఇది కేవలం సమస్యపై చర్చించడానికే అంటూ.. బిఆర్ఎస్ అధినేత కెసిఆర్‌ను కూడా మల్లారెడ్డి కలిసి వివరణ ఇచ్చుకున్నారు.

# ఉత్తరాంధ్రపై వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ ప్రత్యేకంగా ఫోకస

**కీలక నేతలతో వైఎస్ జగన్ ప్రత్యేక సమావేశం**

**విశాఖ, మార్చి 9 (పీపుల్స్ మోటివేషన్) :**

ఏపీలో ఎన్నికలకు సమయం దగ్గర పడుతున్న వేళ వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ ఉత్తరాంధ్రపై ప్రత్యేకంగా ఫోకస్ పెట్టింది. పరిపాలనా రాజధానిగా విశాఖను ప్రకటించిన తర్వాత ఉత్తరాంధ్రలో మళ్ళీ తిరిగి పాగవేయాలని వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ భావిస్తుంది. అందులో భాగంగా 2019 ఫలితాలకు ఏమాత్రం తగ్గకుండా త్వరలో జరగబోయే ఎన్నికల్లో విజయం సాధించేలా అడుగులు వేస్తోంది. తాడేపల్లి సీఎం క్యాంప్ కార్యాలయంలో ఉత్తరాంధ్ర జిల్లాల 34 నియోజకవర్గాల ఎమ్మెల్యేలు ఆయా నియోజకవర్గాల సమన్వయకర్తలతో ప్రత్యేక సమావేశం జరిగింది. ఈ సమావేశానికి ఉత్తరాంధ్ర జిల్లాల ఇన్చార్జిగా ఉన్న వైవీ సుబ్బారెడ్డి.. పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా సజ్జల రామకృష్ణారెడ్డి హాజరయ్యారు. సీఎం జగన్ మోహన్ రెడ్డి అధ్యక్షత వహించారు. ఈ సమావేశంలో ఆయా నియోజకవర్గాల్లో పార్టీ పరిస్థితి రాబోయే సార్వత్రిక ఎన్నికల్లో నియోజకవర్గంలో అనుసరించాల్సిన వ్యూహాలు, పోల్ మేనేజ్మెంట్, ప్రత్యర్థి పార్టీల అభ్యర్థులను ఎదుర్కోవడానికి అనుసరించాల్సిన వ్యూహాలు, నియోజకవర్గంలో ఇప్పటి వరకు ఉన్న పార్టీ పరిస్థితి ఏంటి, నియోజకవర్గంలో సామాజిక, రాజకీయ, ఆర్థిక స్థితిగతులు అడిగి తెలుసుకున్నారు. ఇక ఎన్నికల్లో మూడు పార్టీలు ఏకమై వస్తున్న నేపథ్యంలో ఆయా నియోజకవర్గంలో పార్టీ పరంగా తీసుకోవాల్సిన చర్యలు ఏంటి అనే దానిపై దిశానిర్దేశం చేశారు. ఇప్పటికే ఉత్తరాంధ్ర జిల్లాల్లో సీఎం జగన్ మోహన్ రెడ్డి పర్యటన ముగిసిన నేపథ్యంలో అభ్యర్థులంతా నియోజకవర్గాల్లో చేసిన అభివృద్ధి, సంక్షేమ పథకాలు బలంగా ప్రజల్లోకి తీసుకువెళ్లాలని సూచించారు. ఇప్పటికే నియోజకవర్గాలకు సంబంధించి సమన్వయకర్తలే దాదాపుగా అభ్యర్థుల జాబితా ఉండే అవకాశం ఉందని అందులో భాగంగానే ప్రత్యేకంగా వైసీపీ ఉత్తరాంధ్ర జిల్లాల ఎమ్మెల్యేలతో సమావేశాన్ని నిర్వహించింది. ఈ సమావేశం తరువాత ఇకపై ఉత్తరాంధ్ర జిల్లాల్లో మార్పులు ఉండబోవని సమావేశానికి హాజరైన వారే దాదాపు అభ్యర్థులనే సంకేతాలను బలంగా ప్రజల్లోకి తీసుకుళ్లే ప్రయత్నం చేసింది. ఉత్తరాంధ్రపై వైసీపీ ప్రత్యేకంగా ఫోకస్ పెట్టడానికి ప్రధాన కారణం.. తెలుగుదేశం పార్టీ బలంగా ఉందన్న ప్రచారానికి చెక్ పెట్టడం కోసమని అంటుంది వైసిపి అధిష్టానం. పరిపాలన రాజధానిగా విశాఖపట్టణాన్ని ప్రకటించిన నాటి నుంచి ఏపీ రాజకీయం మొత్తం ఉత్తరాంధ్ర ,అమరావతి కేంద్రంగా తిరుగుతోంది. ఈ నేపథ్యంలో వైసిపి అధికారంలోకి వచ్చాక ఉత్తరాంధ్ర వెనుకబాటుతనాన్ని నిరోధించేలా చేసిన అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రజల్లోకి బలంగా తీసుకుని వెళ్లాలని సజ్జలరామకృష్ణా రెడ్డి, వైవీ సుబ్బారెడ్డి ఆ పార్టీ నేతలకు దిశానిర్దేశం చేశారు.ఇక పొత్తులకు సంబంధించిన అంశంలో నేతలు భిన్నాభిప్రాయాలు వ్యక్తం చేశారు. ఈ నేపథ్యంలో పొత్తుల విషయంలో ఆందోళన చెందాల్సిన అవసరం లేదని రాబోయే ఎన్నికల్లో వైఎస్ఆర్సీపీ ఖచ్చితంగా విజయం సాధిస్తుందని ధైర్యం చెప్పారు. అయితే నేతలంతా క్షేత్రస్థాయిలో పార్టీ శ్రేణులను, కార్యకర్తలను కలుపుకొని ముందుకు వెళ్లాలని సూచించారు. ఇప్పటివరకు సీఎం జగన్మోహన్ రెడ్డి వరుసగా పర్యటనలు చేయడం మరోవైపు రీజనల్ కోఆర్డినేటర్లు సమీక్షలు చేయడం మాత్రమే జరిగిందని.. రాబోయే నెల రోజులు అత్యంత కీలకమని ఎన్నికల షెడ్యూలు విడుదల చేసిన నాటి నుంచి ప్రతి నాయకుడు కార్యకర్తల్లో ఉండాలని సూచించారు ఉత్తరాంధ్ర జిల్లాల ఇంచార్జ్ వైవి సుబ్బారెడ్డి. తాను ఇప్పటికే విశాఖ కేంద్రంగా నియోజకవర్గాల వారీగా సమీక్షలు చేస్తున్నానని ఇకపై సమీక్షలు ఉండే అవకాశం లేదని పూర్తి బాధ్యతలను నేతలే భుజానికి ఎత్తుకోవాలని సూచిస్తున్నారు. అందులో భాగంగానే ఈరోజు జరిగిన సమీక్ష సమావేశంలో పోల్ మేనేజ్మెంట్, బూత్ కమిటీల బలోపేతం, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీకి ఓటు వేసేలా కార్యకర్తలు ప్రతి ఇంటికి వెళ్లాలన్నారు.

తెలుగు దినపత్రిక

# పీపుల్స్ మోటివేషన్

People's Motivation

ఆదివారం । మార్చి । 10 । 2024




# అమలాపురం టిక్కెట్ రాపాకకు కేటాయింపు

## వైసీపీ నిర్ణయంలో ఎంపీ అనూరాధ దిక్కుమొహం

## జనసేన-టీడీపీ కూటమి అభ్యర్థులపై ఆసక్తి

**కోనసీమ, మార్చి 9 (పీపుల్స్ మోటివేషన్) :**

కోనసీమ జిల్లా అమలాపురం వైసీపీ ఎంపీ చింతా అనురాధ కు అవమానాల మీద అవమానాలు ఎదురవుతున్నాయి. అనురాధను సంగతి తేల్చకుండానే అమలాపురం ఎంపీ టికెట్ రాత్రికి రాత్రి జనసేన ఎమ్మెల్యే రాపాక వరప్రసాద్ కు వైసీపీ అధిష్టానం కేటాయించింది. తన పరిస్థితి ఏంటో అర్థం కాక అనురాధ తల పట్టుకుంటున్నారు. వైసీపీ అధిష్టానం తీరుపై అనురాధ అనుచరులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. మొన్నటికి మొన్న వైసీపీ సభలో అమలాపురం ఎంపీ టికెట్ తనదేనని రాపాక ప్రకటించారు. ఆ తర్వాత అమలాపురంలో ఓ కార్యక్రమంలో మైక్ ఇవ్వకుండా మంత్రి విశ్వరూప్ అవమానించారు. సార్వత్రిక ఎన్నికల షెడ్యూల్ మరికొన్ని రోజుల్లో వెలువడనున్న నేపథ్యంలో ప్రధాన రాజకీయ పార్టీలు ఆయా నియోజకవర్గాలకు సమర్థులైన అభ్యర్థుల ఎంపికపై దృష్టి సారించాయి. ప్రధానంగా టీడీపీ, జనసేన సీట్ల సర్దుబాట్లో ఏర్పడ్డ ప్రతిష్ఠంభన తొలగిపోనుంది. వైసీపీ అధిష్ఠానం టీడీపీ, జనసేన అభ్యర్థుల ప్రకటన వెలువడిన తరువాతే ఆ పార్టీ అభ్యర్థులను అధికారికంగా ప్రకటించే అవకాశాలు ఉన్నాయనేది విశ్వసనీయ సమాచారం. అయితే శుక్రవారం రాత్రి రాజోలు అసెంబ్లీ నియోజకవర్గ వైసీపీ సమన్వయకర్తగా ఇటీవలే ఆ పార్టీలో చేరిన మాజీ ఎమ్మెల్యే గొల్లపల్లి సూర్యారావును ఖరారు చేస్తూ అధిష్ఠా నం ప్రకటన చేసింది. అలాగే ఇక్కడ ప్రస్తుత సిటింగ్ ఎమ్మెల్యే రాపాక వర ప్రసాద్‌ను అమలాపురం పార్లమెంటు సమన్వయకర్తగా ఖరారుచేసింది. ఇక జిల్లా పరిధిలోని మిగిలిన స్థానాలకు వైసీపీ సిటింగ్ ఎమ్మెల్యేలు ఉన్నప్పటికీ అభ్యర్థులను అధికారికంగా ప్రకటించకుండా జాప్యం చేస్తుండడంతో వారిలో ఒకింత ఉత్కంఠ నెలకొంది. ప్రస్తుతం హడావుడిగా ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలకు పరిమితమై వైసీపీకి చెందిన సిటింగ్ ప్రజాప్రతినిధులు పనిచేస్తున్నప్పటికీ ఎన్నికల ప్రచారం దిశగా ఏర్పాట్లు చేసుకోకపోవడం సర్వత్రా చర్చనీయాంశమైంది. టీడీపీ, జనసేన, బీజేపీల పొత్తు నేపథ్యంలో సీట్ల సర్దుబాటు చివరి దశలో ఉంది. దీనిలో భాగంగా కోనసీమ జిల్లా నుంచి ఒక స్థానాన్ని బీజేపీకి కేటాయిస్తారా అనేది తాజాగా తెరపైకి వచ్చింది. గతంలో బీజేపీ గెలిచిన పి.గన్నవరం ఎస్సీ రిజర్వుడు స్థానాన్ని బీజేపీకి కేటాయిస్తే ఆ పార్టీ తరపున దళిత అభ్యర్థిని బరిలోకి దింపే అవకాశాలు ఉన్నట్టు జిల్లా బీజేపీ నాయకులు ప్రచారం చేస్తున్నారు. అయితే అటువంటి ప్రతిపాదన లేదని మారిన తాజా పరిస్థితుల నేపథ్యంలో ఆ స్థానాన్ని జనసేనకు కేటాయించే అవకాశాలపై పార్టీ అధినేత పవన్‌కల్యాణ్ ఆరా తీస్తున్నట్టు తెలిసింది. ఇప్పటికే ఆ స్థానాన్ని టీడీపీ అభ్యర్థిగా మహాసేన రాజేష్ పేరును ఖరారు చేయడంతో అక్కడి నుంచి టీడీపీ పోటీ చేస్తుం దా, లేక జనసేనకు ఇస్తారా లేక మధ్యేమార్గంగా బీజేపీకి కేటాయిస్తారా అనేది జిల్లాలో ఉత్కంఠభరితంగా మారింది. అమలాపురంస్థానంపై అభ్యర్థులపై భిన్నాభిప్రాయాలు కూడా వ్యక్తమవుతుండడంతో ఉత్కంఠ రాజకీయాలు ఉత్పన్నమవుతున్నాయి. ఇక జనరల్ స్థానమైన రామచంద్రపురం స్థానం విషయంలో టీడీపీనా, జనసేనా అనేది తాజాగా ఉత్పన్నమవుతున్న ప్రశ్న. అమలాపురం టీడీపీకి కేటాయిస్తే జనసేన రామచంద్రపురం అడిగే అవకాశం ఉన్నట్టు పరిశీలకులు పేర్కొంటున్నారు. ఇదిలా ఉండగా జిల్లాలో వైసీపీ ఎంపీ ప్రకటన వెలువడడంతో ఎమ్మెల్యే అభ్యర్థులను మాత్రమే ఇక ఆ పార్టీ ప్రకటించాల్సి ఉంది. కొన్ని ఎమ్మెల్యేల అభ్యర్థిత్వాల విషయంలో టీడీపీ, జనసేన, బీజేపీ ప్రకటించే అభ్యర్థుల ఆధారంగా ఎంపిక జరగవచ్చని తాజా సమాచారం బట్టి తెలుస్తోంది. అమలాపురం లోక్‌సభ అభ్యర్థిగా వైసీపీ నుంచి తాను పోటీ చేస్తానని రాజోలు సిటింగ్ ఎమ్మెల్యే రాపాక వరప్రసాద్ చేసిన స్వీయ ప్రకటన మేరకే అధిష్ఠానం కూడా ఆ టిక్కెట్టును కేటాయించినట్టు అయింది. ఇటు రాజోలులో నెలకొన్న ఉత్కంఠతకు కూడా తెరపడింది. ఇక్కడ నుంచి వైసీపీ అభ్యర్థిగా మాజీ మంత్రి గొల్లపల్లి సూర్యారావుకు లైన్‌క్లియర్ అయిపోయినట్టే. ఇక అమలాపురం నుంచి మంత్రి పినిపే విశ్వరూప్, ముమ్మిడివరం నుంచి సిటింగ్ ఎమ్మెల్యే పొన్నాడ సతీష్‌కుమార్, కొత్తపేట నుంచి చిర్ల జగ్గిరెడ్డిల పేర్లను అధిష్ఠానం ప్రకటించకపోవడంతో ఆయా నియోజకవర్గాల వైసీపీ శ్రేణులు ఆసక్తితో ఎదురుచూస్తున్నాయి. పి.గన్నవరం వైసీపీ సమన్వయకర్తగా జడ్పీ చైర్మన్ విప్పర్తి వేణుగోపాల్, రామచంద్రపురం వైసీపీ సమన్వయకర్తగా పిల్లి సూర్యప్రకాష్, మండపేట నుంచి తోట త్రిమూర్తులు పేర్లను ఇప్పటికే అధిష్ఠానం ప్రకటించింది. దాంతో మిగిలిన నియోజకవర్గాల్లో అభ్యర్థుల ప్రకటన కోసం వైసీపీ కేడర్



ఎదురుచూస్తోంది.

# 70 ఏళ్లలో చేయలేని పనులు పదేళ్లలో చేశా

- **అభివృద్ధి కోసమే నా నిరంతర తపన**
- **ఈశాన్య రాష్ట్రాల్లో రూ.55వేల కోట్ల విలువైన పనులకు శ్రీకారం**
- **సేలా టన్నెల్‌ను ప్రారంభించిన ప్రధాని మోడీ**

**ఈటానగర్, మార్చి 9 (పీపుల్స్ మోటివేషన్) :**

ఎన్నికల్లో విజయం కోసం కాదు.. ప్రజల అభివృద్ధి కోసమే పనిచేస్తానని ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ అన్నారు. రెండు రోజుల ఈశాన్య రాష్ట్రాల పర్యటనలో భాగంగా శనివారం అరుణాచల్ ప్రదేశ్ కు చేరుకున్న ప్రధాని.. ఈటానగర్ లో పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో ఆయన మాట్లాడుతూ.. నార్త్ ఈస్ట్ లో మోడీ గ్యారంటీ ఫలితాలు కనిపిస్తున్నాయన్నారు. మోడీ గ్యారంటీ అంటే ఏంటో అరుణాచల్ వస్తే తెలుస్తుందన్నారు. స్వాతంత్ర్యం వచ్చినప్పటి నుంచి 2014 వరకు ఈశాన్య ప్రాంతంలో దాదాపు 10వేల కిలోమీటర్ల జాతీయ రహదారిని నిర్మించారని.. కాని, మేము10 ఏళ్లలోనే ఈశాన్య ప్రాంతంలో 6వేల కిలోమీటర్లకు పైగా జాతీయ రహదారిని నిర్మించామని చెప్పారు. కాంగ్రెస్ 70 ఏళ్ల పాలనలో చేయలేని పనులను తాను 10 ఏళ్లలో చేశామన్నారు. సరిహద్దు గ్రామాలను కాంగ్రెస్ నిర్లక్ష్యం చేసిందని మండిపడ్డారు. నార్త్ ఈస్ట్ లో రూ.55వేల కోట్ల విలువైన పనులను ప్రారంభించడం సంతోషంగా ఉందన్నారు. త్వరలో జరగబోయే లోక్ సభ ఎన్నికల్లో ఎన్డీఏ 400 స్థానాల్లో గెలుస్తుందని.. మూడోసారి కూడా తమదే అధికారమని ప్రధాని అన్నారు.ఈశాన్య రాష్ట్రాల్లో రూ.55,600 కోట్ల విలువైన ప్రాజెక్టులను ప్రధాని నరేంద్ర మోదీ ప్రారంభించారు. ఈ సందర్భంగా అరుణాచల్ ప్రదేశ్‌లోని 35 వేల పేద కుటుంబాలకు శాశ్వత ఇళ్లు లభించాయని చెప్పారు. దీంతోపాటు అరుణాచల్, త్రిపురలో వేలాది కుటుంబాలు నీటి కనెక్షన్లు పొందాయని అన్నారు. దీంతోపాటు ఈశాన్య రాష్ట్రాల్లో కనెక్టివిటీకి సంబంధించిన అనేక ప్రాజెక్టుల శంకుస్థాపనలు, ప్రారంభోత్స వాలు జరిగాయని వెల్లడించారు. ప్రారంభించిన వాటిలో సెలా టన్నెల్ ప్రపంచంలోనే అత్యంత ఎత్తైన (13000 అడుగులు) ప్రాంతంలో నిర్మించిన పొడవైన సొరంగం ఉంది. ఇది అరుణాచల్ ప్రదేశ్‌లోని వెస్ట్ కమింగ్, తవాంగ్ జిల్లాలను కలుపుతుంది. చేరుకోవడానికి ఇదే ఏకైక మార్గం కావడం విశేషం. అరుణాచల్ ముఖ్యమంత్రి పెమా ఖండూ ప్రధాని మోదీకి బహుమతి ఇచ్చి స్వాగతం పలికారు. ఈ కార్యక్రమానికి పెద్ద సంఖ్యలో ప్రజలు తరలివచ్చారు. ఇండియా-చైనా సరిహద్దులోని తూర్పు సెక్టార్‌లో నిర్మించిన సేలా టన్నెల్ ను శనివారం ప్రధాని మోదీ ప్రారంభించారు. అరుణాచల్ ప్రదేశ్ రాజధాని ఈటానగర్‌లో నిర్వహించిన 'వికసిత్ భారత్- వికసిత్ నార్త్ ఈస్ట్' కార్యక్రమంలో ఈ ప్రతిష్ఠాత్మక ప్రాజెక్టును జాతికి అంకితం చేశారు. ప్రపంచంలోనే పొడవైన రెండు వరుసల టన్నెల్‌గా ఇది గుర్తింపు పొందింది. సేలా టన్నెల్‌ను సముద్ర మట్టానికి 13వేల అడుగుల ఎత్తులో పర్వతాల మధ్య నిర్మించారు. ఎలాంటి వాతావరణ పరిస్థితుల్లో అయినా బాలిపారా-చారిదౌర్-తవాంగ్ రహదారిలో అనుసంధానం కోల్పోకుండా ఉండే లక్ష్యంతో దీనిని ఏర్పాటు చేశారు. సరిహద్దు రహదారుల సంస్థ ఈ రెండు వరుసల టన్నెల్‌ను నిర్మించింది. ఈ ప్రాజెక్టులో రెండు సొరంగాలు ఉన్నాయి. టన్నెల్-1 సింగిల్ ట్యూబ్‌తో 1,003 మీటర్ల పొడవుండగా.. టన్నెల్-2 రెండు సొరంగమార్గాలతో 1,595 మీటర్ల పొడవు కలిగి ఉంది. రెండింటిని కలిపే రోడ్డు పొడవు 1200 మీటర్లు. టన్నెల్-2 సొరంగమార్గాల్లో ఒకటి సాధారణ ట్రాఫిక్‌కు, మరొకటి ఎమ్జ్ంగ÷న్సీ సర్వీసులకు కేటాయించారు.పర్వతాల మధ్య సేలా పాస్‌కు 400 మీటర్ల దిగువన ఈ నిర్మాణం చేపట్టారు. ఈ టన్నెల్ వల్ల చలికాలంలో కూడా రాకపోకలకు ఎలాంటి అంతరాయం ఉండదు. భారత్-చైనా సరిహద్దులో ఎలాంటి అత్యవసర పరిస్థితుల్లో అయినా ఆయుధాలు, బలగాలను వేగంగా తరలించేందుకు ఉపయుక్తంగా ఉంటుంది. సరిహద్దు ప్రాంత ప్రజలకు సామాజిక-ఆర్థిక ప్రయోజనాన్ని చేకూర్చనుంది. దీంతో తవాంగ్-దిరాంగ్ ప్రాంతాల మధ్య 12 కిలోమీటర్ల మేర దూరం తగ్గనుంది. 90 నిమిషాల ప్రయాణ సమయం ఆదా అవుతుంది. ఈ టన్నెల్ మెరుగైన భద్రతా సామర్థ్యాన్ని కలిగి ఉంది. వెంటిలేషన్ వ్యవస్థలు, లైటింగ్, అగ్నిమాపక పరికరాలు వంటి అధునాతన సదుపాయాలను సొరంగాల్లో ఏర్పాటు చేశారు. 2019 ఫిబ్రవరి 9న ప్రధాని నరేంద్రమోదీ ఈ ప్రతిష్ఠాత్మక ప్రాజెక్టుకు శంకుస్థాపన చేశారు. దీనికోసం ప్రభుత్వం రూ.825 కోట్లు వెచ్చించింది.అరుణాచల్ ప్రదేశ్‌లోని తవాంగ్ చైనా సరిహద్దుల్లో ఉంటుంది. ఈ సొరంగమార్గంతో అత్యవసర పరిస్థితుల్లో భారత దళాలు త్వరితంగా సరిహద్దులకు చేరుకునే అవకాశం కలిగింది. చైనా సరిహద్దులు ఎత్తుగా ఉండటంతో డ్రాగన్ బలగాలు సులభంగా భారత దళాల కదలికలను కనిపెట్టగలవు. అయితే సొరంగమార్గం అందుబాటులోకి రావడంతో వారికి ఆ అవకాశం మూసుకుపోయింది.

# డ్రగ్స్ కేసులో అడ్డంగా దొరికిన సినీ నిర్మాత, అరెస్ట్!

చెన్నై: రూ.2000 కోట్ల విలువైన డ్రగ్స్ స్మగ్లింగ్ కేసులో తమిళ సినీ నిర్మాత ఒకరు అరెస్ట్ అయ్యారు. కొద్ది రోజుల క్రితం ఢిల్లీలో సెంట్రల్ నార్కోటిక్స్ విభాగం పోలీసులు జరిపిన దాడిలో కోట్ల విలువైన నిషేధిత డ్రగ్స్ దొరికాయి. దీనికి సంబంధించి చెన్నైకి చెందిన ముఖేష్, ముజీపూర్, విల్లుపురం అశోకుమార్‌లను అరెస్టు చేశారు. వారి నుంచి డ్రగ్స్ తయారీకి ఉపయోగించే 50 కిలోల రసాయనాలను స్వాధీనం సైతం చేసుకున్నారు. వాటి అంతర్జాతీయ విలువ రూ.2,000 కోట్లు. ఇక ఈ కేసులో తమిళ సినీ నిర్మాత, డీఎంకే చెన్నై వెస్ట్ జిల్లా కమిటీ డిప్యూటీ ఆర్గనైజర్ జాఫర్ సాదిక్ హస్తం కూడా ఉందని అసలు ఆయనే సూత్రధారి అని ఆరోపణలు ఎదుర్కొన్నారు. ఈ ఆరోపణల తర్వాత డీఎంకే నుంచి శాశ్వతంగా బహిష్కరణకు గురయ్యారు. చెన్నై మైలాపూర్ అరులానందం స్ట్రీట్‌లోని ఆయన ఇంటికి వెళ్లిన సెంట్రల్ నార్కోటిక్స్ కంట్రోల్ యూనిట్ అధికారులు జాఫర్ సాదిక్ వ్యక్తిగతంగా హాజరు కావాలని నోటీసును అతికించారు. ఇదే విషయంపై %చీజదీ% డిప్యూటీ డైరెక్టర్ జనరల్ (ఆపరేషన్స్) జ్ఞానేశ్వర్ సింగ్ మాట్లాడుతూ, సాదిక్ అరెస్టును ధృవీకరించారు.అతను భారతదేశం-ఆస్ట్రేలియా-న్యూజిలాండ్ మాదకద్రవ్యాల అక్రమ రవాణా నెట్‌వర్క్‌కు "కింగ్‌పిన్" అని పేర్కొన్నారు. అయితే గత ఫిబ్రవరి 28న జాఫర్ సాదిక్ హాజరు కావాల్సి ఉండగా.. అప్పటి నుంచి కనిపించకుండా ఉంటున్నారు. ఈ నేపథ్యంలో జైపూర్‌లో పరారీలో ఉన్న జాఫర్ సాదిక్‌ను అరెస్టు చేసినట్లు ఎన్‌సీపీ అధికారులు ధృవీకరించారు. ఇక ప్రస్తుతం ఎన్సీపీ అధికారులు అతడిని ముమ్మరంగా విచారిస్తున్నట్లు సమాచారం. ఇదిలా ఉండగా, తమిళనాడు సినీ పరిశ్రమ ప్రముఖులకు కూడా డ్రగ్స్ రవాణా చేస్తున్నట్టు జాఫర్ సాదిక్ అంగీకరించినట్లు ఎన్‌సీపీ అధికారి ఒకరు వెల్లడించారు. జాఫర్ సాదిక్ తమిళనాడు సినీ పరిశ్రమకు చెందిన ప్రముఖులతో టచ్‌లో ఉన్నట్లు కూడా వాంగ్మూలం ఇచ్చారని, విచారణ అనంతరం జాఫర్ సాదిక్‌కు రాజకీయాలు, చిత్ర పరిశ్రమ, నిర్మాణ రంగాల్లోని ముఖ్యాంశాలతో సంబంధం ఉన్నట్లు సమాచారం. డ్రగ్స్ అక్రమ రవాణాకు పాల్పడుతున్న సినీ ప్రముఖుల పేర్లు బయటపెట్టినట్టు తెలుస్తోంది. జాఫర్ సాదిక్‌కి బాలీవుడ్ సినీ పరిశ్రమతో కూడా లింక్ ఉందని ఈ కోణంలో కూడా విచారణ కొనసాగుతోందని చెప్పారు.

# మధ్యప్రదేశ్ సెక్రటేరియట్‌లో భారీ అగ్నిప్రమాదం

భోపాల్ : మధ్యప్రదేశ్ రాజధాని భోపాల్ లోని రాష్ట్ర సచివాలయం, వల్లభ్ భవన్ లో భారీ అగ్నిప్రమాదం జరిగింది. భోపాల్ లో ఉన్న సెక్రటేరియట్ లో ఒక్కసారిగా మంటలు వ్యాపించాయి. మూడో అంతస్తులో మంటలు చెలరేగి పొగలు రావడం గుర్తించిన పారిశుధ్య కార్మికులు వెంటనే అధికారులకు సమాచారమిచ్చారు.అప్రమత్తమైన అగ్నిమాపక సిబ్బంది.. హుటాహుటిన అక్కడికి చేరుకుని., 20 అగ్నిమాపక యంత్రాలతో సహాయక చర్యలు చేపట్టారు. ప్రస్తుతం మంటలు అదుపులోకి వచ్చాయని అధికారులు వెల్లడించారు. ఈ ప్రమాదంలో ఎవరికీ ఎలాంటి హానీ జరగలేదని తెలిపారు. కాగా.. మూడో అంతస్తులో ఉంచిన కీలకమైన డాక్యుమెంట్లు కాలిపోయినట్లు తెలుస్తోంది. అగ్నిప్రమాదానికి గల కారణాలపై పోలీసులు, అధికారులు ఆరా తీస్తున్నారు.

# గజ్వేల్‌లో బీఆర్ఎస్‌కు షాక్

- **బీఆర్ఎస్ వీడి కాంగ్రెస్‌లో చేరిన నేతలు**
- **కండువా కప్పి ఆహ్వానించిన మంత్రి పొన్నం**

**సిద్ధిపేట, మార్చి 9 (పీపుల్స్ మోటివేషన్) :**

ప్రతిపక్ష పార్టీ బీఆర్ఎస్‌కు షాక్‌ల మీద షాక్‌లు తగులుతూనే ఉన్నాయి. పలు జిల్లాల్లో బీఆర్ఎస్ నేతలు పార్టీని వీడుతున్నారు. తాజాగా సిద్దిపేట జిల్లా గజ్వేల్ నియోజకవర్గం కొండపాక మండలంలోని పలు గ్రామాల బీఆర్ఎస్ నాయకులు కాంగ్రెస్ పార్టీలోకి చేరారు. సిద్దిపేట డీసీసీ అధ్యక్షులు తుముకుంట నర్సారెడ్డి ఆధ్వర్యంలో కొండపాక మాజీ ఎంపీపీ అనంతుల పద్మ - నరేందర్ , వంద మందికి పైగా ఇతర పార్టీల నేతలు కాంగ్రెస్‌లో చేశారు. రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ వారికి కాంగ్రెస్ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. 10 సంవత్సరాల బీఆర్ఎస్ పాలన నియంతృత్వంతో అప్రజాస్వామ్యంగా కొనసాగిందన్నారు. డిసెంబర్ 7న కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడగానే ప్రగతి భవన్ కంచెలు బద్దలు కొట్టామని.... ప్రగతి భవన్‌ను జ్యోతి రావు పులే ప్రజా భవన్‌గా మార్చుకున్నామన్నారు. ప్రభుత్వం ఏర్పడిన 48 గంటల్లో రెండు గ్యారంటీ స్కీమ్స్ అమలు చేశామని చెప్పుకొచ్చారు. పేదలకు ఎంతగానో ఉపయోగపడే 500 కే గ్యాస్, 200 యూనిట్ల ఉచిత విద్యుత్‌ను అమలు చేశామన్నారు. 11 నుంచి ఇందిరమ్మ ఇళ్లు పథకాన్ని ప్రారంభిస్తున్నామని తెలిపారు. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిందని.. ఈ ప్రజా ప్రభుత్వం మరింత ముందుకు పోవాలంటే దేశంలో కూడా కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావాలన్నారు. డబుల్ ఇంజన్ సర్కార్ వస్తే మరింత ముందుకు పోదామని... కేంద్రం సహకారం ఇస్తే మంచిది.. లేకపోతే బరాబర్ కొట్లాడతామని స్పష్టం చేశారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం డబుల్ బెడ్రూమ్ ఇవ్వలేదని.. దళితులకు 3 ఎకరాల భూములు ఇవ్వలేదని.. నిరుద్యోగ భృతి ఇవ్వలేదని విమర్శించారు. పార్లమెంట్‌తో పాటు రాబోయే రోజుల్లో స్థానిక సంస్థల ఎన్నికల్లో కూడా కాంగ్రెస్ పార్టీ విజయం సాధిస్తుందని మంత్రి పొన్నం ప్రభాకర్ ధీమా వ్యక్తం చేశారు.

# ఓనమాలు మాత్రమే నేర్చుకొంటే తెలుగు ఆనవాళ్లు ఉండవు

**భారత మాజీ ఉప రాష్ట్రపతి వెంకయ్యనాయుడు**

**కాకినాడ, మార్చి 9 (పీపుల్స్ మోటివేషన్) :**

ఓనమాలు మాత్రమే నేర్చుకొంటే.. తెలుగు ఆనవాళ్లు ఉండవు అని హెచ్చరించారు భారత మాజీ ఉప రాష్ట్రపతి ఎం. వెంకయ్యనాయుడు.. కాకినాడలో అఖిల భారత తెలుగు సాహితీ సదస్సును ప్రారంభించిన ఆయన.. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. కొందరు భాష చాలా ఎబ్బెట్టుగా, వెటకారంగా మాట్లాడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.. ప్రభుత్వాలు దురదృవశాత్తు సాహిత్యాన్ని ప్రోత్సహించడం లేదన్నారు.. ఓనమాలు మాత్రమే నేర్చుకొంటే.. తెలుగు భాష ఆనవాళ్లు కూడా ఉండవన్నారు. ఉప రాష్ట్రపతి అయిన తర్వాత రెస్ట్ తీసుకునే అవకాశం వచ్చిందన్నారు. ఇక, 45 ఏళ్లు విరామం లేకుండా రాజకీయాలు చేశాను అని గుర్తుచేసుకున్నారు.. మాతృ భాష తల్లి లాంటిది.. తెలుగు శతకాలు అలవాటు చేస్తే పిల్లలు బాగుపడతారు అని సూచించారు భారత మాజీ ఉప రాష్ట్రపతి ఎం. వెంకయ్యనాయుడు..కాగా, వంగూరి ఫౌండేషన్ ఆఫ్ అమెరికా 30వ వార్షికో త్సవం సందర్భంగా.. తూర్పుగోదావరి జిల్లా రచయితల సంఘం సంయుక్తంగా కాకినాడలో ఈ రోజు, రేపు రెండు రోజులపాటు అఖిల భారత తెలుగు సాహితీ సదస్సు నిర్వహిస్తున్నారు.. కాకినాడ దంటు కళాక్షేత్రంలో జరుగుతోన్న ఈ సదస్సుకు ఈ రోజు ముఖ్యఅతిథిగా భారత మాజీ ఉప రాష్ట్రపతి ముప్పవరపు వెంకయ్యనాయుడు హాజరయ్యారు.. తెలుగు భాషలో వస్తున్న మార్పులపై ఆందోళన వ్యక్తం చేశారు.

# రాహుల్‌ని ప్రధాని చేయడమే సోనియాగాంధీ లక్ష్యం

- **కాంగ్రెస్ పేదలకు చేసిందేం లేదు**
- **కేంద్ర హోంమంత్రి అమిత్ షా ఆరోపణ**


**పాట్నా, మార్చి 9 (పీపుల్స్ మోటివేషన్) :**


కాంగ్రెస్, ఆర్జేడీ నేతలు తమ కుటుంబాల ప్రయోజనాల కోసమే పనిచేశారని, పేదల కోసం ఏం చేసింది లేదని కేంద్ర హోంమంత్రి అమిత్ షా శనివారం ఆరోపించారు. పాట్నాలోని పాలిగంజ్ ప్రాంతంలో జరిగిన ఓబీసీ మోర్చా ర్యాలీలో ఆయన ప్రసంగించారు. పేదలకు మేలు చేసింద కేవలం ప్రధాని నరేంద్రమోడీ, బీజేపీ మాత్రమే అని అన్నారు. కాంగ్రెస్ నేతలు ఎల్లప్పుడూ వారి కుటుంబాలను జాగ్రత్తగా చూసుకున్నారని, వెనకబడిన ప్రజల పేరుతో లాలూ ప్రసాద్ యాదవ్ కూడా తన కుటుంబం కోసమే జీవితమంతా జీవించారని ఆరోపించారు. సోనియా గాంధీ ఏకైక లక్ష్యం తన కుమారుడు రాహుల్ గాంధీని ప్రధానిగా చేయడమే అని అన్నారు.పేదల నుంచి భూములు లాక్కున్న వారిపై ప్రభుత్వం త్వరలో కమిటీ వేసి కఠిన చర్యలు తీసుకుంటామని చెప్పారు. వెనకబడిన వర్గాల, పేదల భూములను లాలూ ప్రసాద్ లాక్కున్నాడని, బీహార్‌లో మళ్లీ డబుల్ ఇంజన్ సర్కార్ ఏర్పడిందని ల్యాండ్ మాఫియాపై మా ప్రభుత్వం కఠినంగా వ్యవహరిస్తుందని అన్నారు. కాంగ్రెస్, ఆర్జేడీ ఎక్కువ కాలం అధికారంలో ఉన్నప్పటికీ సీనియర్ నేత కర్పూరీ ఠాకూర్‌కి తగిన గౌరవం ఇవ్వలేదని షా విమర్శించారు.

తెలుగు దినపత్రిక
పీపుల్స్ మోటివేషన్
People's Motivation

# సస్పెన్స్, థ్రిల్లర్ మూవీలో ఎస్తర్

ఎస్తర్ 'మాయ' సినిమాలో కథానాయకురాలిగా నటించింది. ఈ సినిమా వచ్చే వారం మార్చి 15న విడుదలవుతోంది. రమేష్ నాని ఈ సినిమాకి దర్శకుడు, కాగా రాజేష్ నిర్మాత. ఒక సినిమా షూటింగ్ చేస్తున్నప్పుడు లంచ్ టైములో ఈ కథ వచ్చి దర్శకుడు రమేష్ నాని చెప్పారని, వెంటనే నచ్చి ఒకే చేసానని ఎస్తర్ చెప్పారు. ఇలాంటి సినిమాలు చాలా అరుదుగా వస్తూ వుంటాయని, అందరూ చూడాల్సిన సినిమా అని ఎస్తర్ చెప్పారు. ఇది ఒక సస్పెన్స్ థ్రిల్లర్ మూవీ అని చెపుతోంది ఎస్తర్. అయితే ఆ రెండు ఎలిమెంట్స్ కాకుండా, ఈ సినిమాలో భావోద్వేగాలకు పెద్దపీట వేశారని చెపుతోంది. ఈ సినిమాకి పనిచేసిన దర్శకుడు, నిర్మాత, ఎడిటర్ దగ్గర నుండి చాలామంది కొత్తవారు పనిచేశారని చెప్పింది. ఇలా ఒక కొత్త టీముతో పనిచెయ్యడం తనకి చాలా హ్యాపీగా వుంది అని చెపుతోంది. తాను ఇంతకు ముందు 'డెవిల్' అనే సినిమాలో ఒక చిన్న క్యారెక్టర్ పాత్ర వేశానని, అలాగే ఇంకా కొన్ని సినిమాల్లో కూడా చిన్న పాత్రలు చేశానని, కానీ ఈ సినిమాల్లో ప్రధాన పాత్రలో కనపడతాను అని చెపుతోంది. క్యారెక్టర్ పాత్రలో ఎస్తర్ చేసింది, అందుకని ఆమెకి ఇంకా కథానాయిక పాత్రలు రావు అని చాలామంది అనుకునేవాళ్లు. వాళ్ళ ఈ సినిమాలో హర్రర్, థ్రిల్లర్, భావోద్వేగాలుంటాయి. అలాగే ఈ సినిమా ఒక ఫిమేల్ సెంట్రిక్ మూవీ. ఈ సినిమా థీమ్ కొత్తది, ఇది నాకు మంచి పేరు తీసుకు వస్తుంది అని అనుకుంటున్నాను అని చెప్పింది ఎస్తర్. ఎందుకంటే నేను ఈ సినిమాలో చేసిన పాత్ర ఇంతవరకు చెయ్యలేదు, చాలా కొత్తగా కనపడతాను ఇందులో. ఒక పక్క 'మాయ' ప్రచారాలు చేస్తూనే, ఇంకో పక్క కొత్త సినిమాల షూటింగ్ డే అండ్ నైట్ షూట్ చేస్తున్నాను. రెండు మూడు సినిమాలు ఒకేసారి చేస్తున్నాను, షూటింగ్ కూడా ఒక సినిమా పగలు చేస్తే, ఇంకో సినిమా రాత్రి చేస్తున్నాను. మధ్యలో ఎప్పుడైనా టైము దొరికితే 'మాయ' సినిమాకి ప్రచారాలు చేస్తున్నాను అని చెప్పింది ఎస్తర్.







## పాజిటివ్ టాక్ సొంతం చేసుకున్న భీమా

గోపీచంద్ కథానాయకుడిగా ఎ.హర్ష దర్శకత్వంలో తెరకెక్కిన చిత్రం 'భీమా'. తాజాగా ప్రేక్షకుల ముందుకువచ్చిన ఈ సినిమా పాజిటివ్ టాక్‌ను సొంతం చేసుకుంది. దీంతో చిత్రబృందం ప్రత్యేక మీడియా సమావేశాన్ని ఏర్పాటుచేసి ప్రేక్షకులకు కృతజ్ఞతలు చెప్పింది. 'మంచి సినిమాను ఆదరించినందుకు అందరికీ ధన్యవాదాలు. ఇలాంటి కథకు నన్ను ఎంచుకున్నందుకు దర్శకుడికి కృతజ్ఞతలు చెప్పాలి. ఈ సినిమాలో నరేశ్ పాత్రకు మంచి ఆదరణ వచ్చింది. ఆయన స్క్రీన్‌పై కనిపిస్తున్నంతసేపు చప్పట్లు వినిపిస్తూనే ఉన్నాయి. ఇందులోని డైలాగులు,  ÷ట్లు, మ్యూజిక్ ఇలా ప్రతిదాని వెనకాల ఎంతోమంది కష్టం ఉంది. తెరపై చూస్తే అది అర్థమైంది. నాకు వ్యక్తిగతంగా కామెడీ అంటే ఇష్టం. ఇందులో ఫస్ట్‌హాఫ్‌లో సన్నివేశాలు అందరికీ బాగా నచ్చాయి. నరేశ్, నాకు మధ్య సన్నివేశాలు చిత్రీకరించేటప్పుడే తెగ నవ్వొచ్చేది.

## విడాకుల వార్తలకు నయన్ చెక్



విఘ్నేశ్ శివన్, నయనతార విడిపోతున్నట్లు కొంతకాలంగా కోలీవుడ్‌లో ప్రచారం జరుగుతోన్న విషయం తెలిసిందే. తాజాగా నయనతార భర్తను ఇన్‌స్టాలో అన్‌ఫాలో చేయడం.. మళ్లీ కొంతసేపటికి ఫాలో చేయడం. 'నేను సర్వం కోల్పోయాను' అని పోస్ట్ పెట్టడం. మళ్లీ దాన్ని డిలీట్ చేయడం.. ఇవన్నీ ఆ వార్తలకు మరింత బలాన్ని చేకూర్చాయి. అయితే వీరు ఆ రూమర్స్‌కు చెక్ పెట్టారు. కవల పిల్లలతో కలిసి వెకేషన్‌కు ఫారిన్ టూర్ వెళ్తున్నట్లు తెలిపారు. దీనికి సంబంధించిన ఫొటోలను సోషల్ మీడియాల్లో పోస్ట్ చేశారు. అలాగే, నయనతార ఫొటోలను షేర్ చేసిన విఘ్నేశ్ మహిళా దినోత్సవ శుభాకాంక్షలు చెప్పారు. దీనికి ఆమె రిప్లై ఇస్తూ.. 'నన్ను ఇంత గొప్ప మహిళగా మార్చినందుకు ధన్యవాదాలు' అంటూ హార్ట్ ఎమోజీలు పెట్టారు. ఫారిన్‌లో ఎంజాయ్ చేస్తోన్న వీడియోలను ఫ్యాన్స్‌తో పంచుకున్నారు. ప్రస్తుతం అవి ఎక్స్‌లో వైరల్ అవుతున్నాయి. దీంతో విడాకుల రూమర్స్‌కు ఫుల్‌స్టాప్ పడినట్లైంది. ఇప్పటి వరకు తెలుగు, తమిళ భాషల్లో సత్తా చాటిన నయనతార గతేడాది 'జవాన్'తో బాలీవుడ్‌లోకి అడుగుపెట్టారు. షారుక్ హీరోగా అట్లీ దర్శకత్వంలో తెరకెక్కిన ఈ చిత్రంలో అద్భుతంగా నటించారు. భారీ విజయాన్ని సాధించిన ఈ చిత్రం రూ.1000కోట్లకు పైగా వసూళ్లు చేసింది.

Printed, Published and Owned by M.RAMESH, H.No. 87/-569, Ground floor, Madhavanagar, Kurnool City, Kurnool - 518002, Andhrapradesh State, and Printing at PSR Printers, No.87-569, Beside, Chenchureddy Apartment, Madhava nagar,Kurnool - 518002 District, Andhrapradesh, Published from H.No. H.No. 87/-569, Ground floor, Madhavanagar, Kurnool City, Kurnool - 518002, Andhrapradesh, Editor : M.RAMESH, Mob : 8008622746,E-mail : peoplesmotivation22@gmail.com